సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

రంజాన్ వేళలు
ఇఫ్తార్ సాయంత్రం 6.25
సహర్ ఉదయం 5.18

హైదరాబాద్
గురువారం, 19.02.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 119
పేజీలు: 12 వెల: రూ. 5


## స్మార్ట్ ప్రయాణం



- ఆర్టీసీ బస్సుల్లో ఇతర రాష్ట్రాల మహిళల ప్రయాణానికి చెక్
- తెలంగాణ మహిళలకు వచ్చే నెల నుంచి స్మార్ట్ కార్డులు
- ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి

03

## రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ రిలీజ్

### దేశ వ్యాప్తంగా 37 స్థానాలకు ఎన్నికలు



- తెలంగాణలోనూ రెండు స్థానాలకు ఎన్నికలు
- ఏప్రిల్ 9న ముగియనున్న పదవీకాలం
- బీఆర్ఎస్ పార్టీ నుంచి కేఆర్ సురేష్ రెడ్డి
- కాంగ్రెస్ తరపున అభిషేక్ మను సింఘ్వీ
- ఈ నెల 25న నోటిఫికేషన్, మార్చి 16న పోలింగ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో మరోసారి ఎన్నికల హడావుడి మొదలు కానుంది. ఖాళీగా ఉన్న రాజ్యసభ స్థానాలకు భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 37 మంది రాజ్యసభ ఎంపీల పదవీకాలం పూర్తికానుండగా.. ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూలు మిగతా 02లో

# హంగామా

## హంగ్ పుర పీఠాల్లో కొలిక్కిరాని చైర్మన్ ఎన్నిక

- క్యాతనపల్లిలో బీఆర్ఎస్, సీపీఐల బంద్
- చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్
- ఉద్రిక్తతకు నడుమ కోర్టుకు, 14 రోజుల రిమాండ్
- ఇబ్రహీంపట్నం ఎన్నికకు హైకోర్టు లైన్ క్లియర్
- ఎన్నికపై కలెక్టర్ దే తుది నిర్ణయమని వ్యాఖ్య
- ఖానాపూర్ లో బీఆర్ఎస్ కు మద్దతు ఇచ్చిన బీజేపీ
- చైర్మన్ కాలపరిమితిని చెరిసగం పంపకాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మూడో రోజూ ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ నెల 16న చైర్మన్ ఎన్నిక సందర్భంగా తలెత్తిన ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మంత్రి వివేక్ వెంకటస్వామి



అడ్డుకున్నారని ఆరోపిస్తూ బుధవారం క్యాతనపల్లి బంద్‌కు బీఆర్ఎస్, సీపీఐలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలోనే మరోసారి పరిస్థితులు తీవ్రంగా మారాయి. మంగళవారం మంత్రి వివేక్, ఎంపీ గడ్డం వంశీలను అడ్డుకొని, వారి కాన్వాయ్ పై దాడితో పాటు పోలీసులపై దౌర్జన్యం చేశారని, విధులను అడ్డుకున్నారని మంగళవారం బాల్క సుమన్‌పై శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగా పోలీసులు బాల్క సుమన్‌ను అరెస్ట్ చేయడం.. అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. మిగతా 09లో



# పల్లెకు ప్రణామం

### దేశానికే ఆదర్శంగా తెలంగాణ పల్లెలు

- గ్రామీణ స్వపరిపాలనలో టాప్
- రికార్డు స్థాయిలో జాతీయ పురస్కారాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీల జైత్రయాత్ర కొనసాగుతోంది. దేశానికే ఆదర్శం నిలుస్తున్న మన పల్లెలు.. గ్రామీణ పాలనలో బెస్ట్ అనిపించుకుంటున్నాయి. రికార్డు స్థాయిలో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుంటున్నాయి. ఒక్క 2023 ఏడాదిలోనే మొత్తం 9 విభాగాల్లో ఎనిమిది జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నాయి. 'పల్లె సీమలే దేశానికి పట్టుకొమ్మలు' అన్న మాటను నిజం చేస్తూ తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శంగా మిగతా 02లో

# రేవంత్ కీ రోల్

## మున్సిపల్ విజయంతో రేవంత్‌కు కొత్త ఇమేజ్

- హైకమాండ్ వద్ద పెరిగిన రాజకీయ ప్రాధాన్యం
- 'నేనే రాజు..నేనే మంత్రి' వ్యాఖ్యల వెనుక అసలు అర్థం
- కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయాలకు చెక్
- సీనియర్లను సమన్వయం చేస్తూ రేవంత్ ఎదుగుదల
- జాతీయ స్థాయిలో నెక్స్ట్ జనరేషన్ లీడర్‌గా గుర్తింపు
- కేబినెట్ విస్తరణపై మళ్లీ చర్చలు వేగం
- రాజ్యసభ ఎంపికలో సీఎం కీలక పాత్ర రేవంత్ లెక్కలకే ఢిల్లీ గ్రీన్ సిగ్నల్..?




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రేవంత్ రెడ్డి నాయకత్వమే కారణమనే ప్రచారానికి ఇప్పుడు రాష్ట్రంలో ముగిసిన మున్సిపల్ ఎన్నికలు అదే నాయకత్వానికి ఒక యాసిడ్ టెస్ట్‌గా నిలిచాయి. ప్రభుత్వ వ్యతిరేకత పేరుతో జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టి.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 80 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయడం రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహ చతురతకు నిదర్శనంగా మారింది. ముఖ్యంగా పట్టణ ఓటర్లు కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం, గతంలో కేవలం గ్రామీణ పార్టీగా ఉన్న ముద్రను రేవంత్ చెరిపివేయగలిగారు. ఈ విజయంతో ఆయన హైకమాండ్ వద్ద తన పరపతిని అమాంతం మిగతా 02లో

## ట్రిపుల్ ఆర్‌కు ముందడుగు

### ఉత్తర భాగానికి పూర్తి క్లియరెన్స్



- ఈ నెలాఖరులోగా అన్ని అనుమతులు
- త్వరలోనే మొదలుకానున్న పనులు

03

## ధరణి దోపిడీపై ఉక్కుపాదం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



- తీగలాగితే డొంక కదిలినట్లుగా ధరణి వ్యవహారం
- అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు
- కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు

09

# గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం

### సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం

- నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ.. అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన
- పట్టణాభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం
- ముంబయి క్లైమెట్ వీక్ కాన్ఫరెన్స్ లో తెలంగాణ

10



## సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హత్య

- రెండో పెళ్లి చేసుకుందని చంపిన మాజీ భర్త
- పోలీసుల అదుపులో నిందితుడు

03






## నల్లమల మీదుగా ఆకాశ మార్గం

### శ్రీశైలం ప్రయాణానికి భారీ ఊరట!

- శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు!
- మల్లన్న గుడి దగ్గరగా మన్ననూర్ - శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్
- టైగర్ రిజర్వ్‌లో ట్రాఫిక్ సమస్యలకు చెక్
- హైదరాబాద్-శ్రీశైలం రూట్‌కు గేమ్‌చేంజర్
- కేంద్రం సూచనతో ప్రాజెక్టు రూపురేఖలు మార్పు

02





# బ్రహ్మోత్సవాలకు వేళాయే..

### దీపాలంకరణలతో మెరిసిపోతున్న ఆలయం

తెలంగాణ తిరుపతిగా విరాజిల్లుతున్న యాదాద్రి క్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.

అంతర్జాతీయ ప్రమాణాలతో 03

## రోడ్ నెట్ వర్క్

### ఆర్అండ్ బీ మంత్రి వెంకట్ రెడ్డి



- హ్యామ్ మోడల్ పద్ధతిలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం
- ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే ఆర్ఆర్ఆర్ పై ఫోకస్
- ఆర్అండ్ బీ వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష



# హస్తినలో కలుద్దాం

### హైకమాండ్ పిలుపుతో ఢిల్లీ బాట పట్టిన టి కాంగ్రెస్ నేతలు

- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కీలక సమావేశాలకు సన్నాహాలు
- మున్సిపల్ ఫలితాలపై అధిష్టానానికి నివేదిక సమర్పణ
- ఖర్గే, రాహుల్, వేణుగోపాల్ తో కీలక చర్చలు ఇవాళ
- స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేసే హైకమాండ్
- నామినేటెడ్ పదవుల భర్తీపై స్పష్టత వచ్చే అవకాశాలు
- మంత్రివర్గ విస్తరణపై సీల్డ్ కవర్ క్లారిటీ?
- మూసీ పునరుజ్జీవనం, మెట్రో విస్తరణపై దృష్టి
- పార్టీ పనితీరు ఆధారంగా పదవుల కేటాయింపులు జరిగే సూచనలు

కేంద్ర నిధుల కోసం సీఎం ఢిల్లీలో ప్రత్యేక భేటీలు

పార్టీ పనితీరు ఆధారంగా పదవుల కేటాయింపులు జరిగే సూచనలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర కాంగ్రెస్ నేతలు హస్తినకు పయనమయ్యారు. మంగళవారం సాయంత్రం ముంబై వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. బుధవారం వరకే ఢిల్లీకి చేరారు. సీఎంతో పాటు రాష్ట్రానికి చెందిన కీలక నేతలు ఢిల్లీకి వెళ్లారు. గురువారం హైకమాండ్ తో సమావేశం కానున్నారు. కీలక అంశాలపై హైకమాండ్ దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పలువురు కీలక మంత్రులు ఢిల్లీకి వెళ్లారు. మిగతా 02లో






సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 19.02.2026
www.mudranews.in | @mudranews



## స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)




దేశంలో అతిపెద్ద పబ్లిక్ సెక్టర్ బ్యాంక్‌గా SBI నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించిన విస్తృత నెట్‌వర్క్ దీనికి ప్రత్యేకత.

# పల్లెకు ప్రణామం

(మొదటి పేజీ తరువాయి)
నిలుస్తున్నాయి. పంచాయతీలు ప్రగతిలో దూసుకెళుతూ.. రికార్డు స్థాయిలో అవార్డులు, రివార్డులు సాధిస్తున్నాయి. సమర్థవంతమైన గ్రామీణ పాలతో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్నాయి. 2023లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలలో మొత్తం తొమ్మిది విభాగాలకు గాను ఎనిమిది విభాగాల్లో అవార్డులు కైవసం చేసుకుని తెలంగాణ సరికొత్త రికార్డు సృష్టించింది. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ వివరాల ప్రకారం.. తెలంగాణలోని నాలుగు గ్రామాలు ప్రథమ స్థానంలో నిలిచి ఒక్కొక్కటి రూ. కోటి నగదు బహుమతిని గెలుచుకున్నాయి. కొత్తగూడెం జిల్లాలోని గౌతంపూర్ ఆరోగ్యకరమైన పంచాయతీ, జనగాం జిల్లా నెల్లుట్ల జల సమృద్ధి గల పంచాయతీగా, మహబూబ్‌నగర్ జిల్లా కొంగటపల్లి సామాజిక భద్రత గల పంచాయతీగా, సూర్యాపేట జిల్లా ఐపూర్ మహిళా స్నేహపూర్వక పంచాయతీగా ప్రథమ స్థానంలో నిలిచి ఒక్కో గ్రామ పంచాయతీ రూ. కోటి చొప్పున రివార్డును పొందాయి.

మరో రెండు పంచాయతీలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 75 లక్షల చొప్పున గెలుచుకున్నాయి. పేదరిక నిర్మూలన విభాగంలో గద్వాల జిల్లా మందోడ్డి, వికారాబాద్ జిల్లాలోని చీమల్దారి గ్రామం సుపరిపాలన విభాగంలో గుర్తింపు పొందాయి. అలాగే పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో, సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాల విభాగంలో తృతీయ స్థానాలు సాధించి రూ. 50 లక్షల చొప్పున నగదు బహుమతిని అందుకున్నాయి.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ బ్లాక్ పంచాయతీ, అలాగే ములుగు జిల్లా పంచాయతీ జాతీయ స్థాయిలో రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. ఆదిలాబాద్‌లోని మఖరా, రంగారెడ్డిలోని కన్హా గ్రామాలు ప్రత్యేక విభాగాల్లో అవార్డులు సాధించాయి. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రాజ్యసభలో వెల్లడించిన వివరాల ప్రకారం.. స్థానిక సంస్థల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు ఈ పురస్కారాలను అందజేస్తున్నారు. 2023తో పోలిస్తే తరువాతి ఏళ్లలో అవార్డుల సంఖ్య తగ్గినప్పటికీ.. తెలంగాణ తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. 2024లోలో పెద్దపల్లి జిల్లా చిల్లపల్లి గ్రామం మహిళా స్నేహపూర్వక విభాగంలో రెండో స్థానం సాధించింది.2025లో రంగారెడ్డి జిల్లా మాల్ గ్రామం 'ఆత్మనిర్భర్ పంచాయతీ' ప్రత్యేక విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇలా తెలంగాణ పల్లెలు అభివృద్ధి పథకంలో దూసుకెళ్తూ.. అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుంటున్నాయి.




# రేవంత్ కీ రోల్



(మొదటి పేజీ తరువాయి)
పెంచుకున్నారు.

**నేనే రాజు.. నేనే మంత్రి**

ఢిల్లీ వేదికగా రేవంత్ రెడ్డి చేసిన నేనే రాజు.. నేనే మంత్రి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. అయితే, దీనిపై ఆయన తర్వాతి కాలంలో స్పష్టత ఇచ్చారు. తాను ముఖ్యమంత్రిగా ఉండటంతో పాటు, మున్సిపల్ పరిపాలన శాఖను కూడా తానే పర్యవేక్షిస్తున్నందున, ఈ ఎన్నికల గెలుపోటములకు తానే పూర్తి బాధ్యత వహిస్తాననే ఉద్దేశంతో ఆ మాట అన్నట్లు వివరించారు. ఒక సేవకుడిగానే తాను బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని చెబుతూనే, బాధ్యతను భుజానికెత్తుకునే విషయంలో తనకున్న తెగింపును ఈ వ్యాఖ్యల ద్వారా చాటారు.

**కాంగ్రెస్‌లో రేవంత్ వ్యతిరేక వర్గం లేదు!**

కాంగ్రెస్ పార్టీలో సహజంగా ఉండే గ్రూపు రాజకీయాలు రేవంత్ రెడ్డి విషయంలో ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. పార్టీలో ఆలస్యంగా చేరినప్పటికీ, సీనియర్లను సమన్వయం చేసుకుంటూనే, తన నిర్ణయాలే ఫైనల్ అనే స్థాయికి ఆయన ఎదిగారు. గతంలో బహిరంగంగా విమర్శలు చేసిన నాయకులు కూడా ఇప్పుడు మౌనం వహించడం. రేవంత్ నాయకత్వాన్ని సమర్థించడం ఆయన సాధించిన అతిపెద్ద రాజకీయ విజయం. హైకమాండ్ పూర్తి మద్దతు ఉండటంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో రేవంత్ ఇప్పుడు ఒక్కడే మొనగాడుగా కనిపిస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యతిరేక కామెంట్లు చేస్తున్నా ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదు.

**తదుపరి తరం నేతగా రేవంత్**

మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నెక్స్ట్ జనరేషన్ లీడర్‌గా గుర్తింపు పొందుతున్నారు. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడుతూ జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో పార్టీకి స్టార్ క్యాంపెయినర్‌గా మారుతున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నమ్మకాన్ని చూరగొనడంలో ఆయన సఫలీకృతులయ్యారు.

**రాష్ట్రంలో తిరుగులేని పట్టు**

వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించడంతో తెలంగాణలో రేవంత్ రెడ్డికి ఎదురులేకుండా పోయింది. అటు విపక్ష బీఆర్ఎస్ బలహీనపడటం, ఇటు బీజేపీ పట్టణ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవడం రేవంత్‌కు కలిసొచ్చింది. తన సంక్షేమ పథకాలు, దూకుడుగా ఉండే రాజకీయ శైలితో రేవంత్ రెడ్డి తెలంగాణ రాజకీయ యవనికపై ఒక బలమైన ముద్ర వేశారు. ఇది రేవంత్ నాయకత్వ పరంగా పుంజుకోవడానికి కలిసి వచ్చింది.

**కేబినెట్ విస్తరణ..**

మరోవైపు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఏకపక్షంగా విజయం సాధించటంతో అధినాయకత్వం ఇక కొత్త నిర్ణయాలతో సిద్ధం అవుతోంది. అందులో భాగంగా ప్రభుత్వం పార్టీలో రేవంత్ కోరుకున్న విధంగా పదవుల ఖరారు.. మార్పుల దిశగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో.. ప్రస్తుతం కేబినెట్ లో ఉన్న ఖాళీల భర్తీతో పాటుగా రెండు మూడు మార్పులు ఖాయంగా కనిపిస్తోంది. పార్టీ.. ప్రభుత్వంలో కీలక పదవులను భర్తీ చేసేందుకు తుది కసరత్తు జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ నేతలతో కలిసి ఢిల్లీలో మకాం వేసారు. ఇక.. రాజకీయంగా మరింత బలోపేతం కావాలని రేవంత్ భావిస్తున్నారు. అందుకు హైకమాండ్ సైతం ఫ్రీ హ్యాండ్ ఇచ్చేలా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా కేబినెట్ విస్తరణ.. నామినేటెడ్ పదవుల్లో రేవంత్ లిస్టుకు ఆమోదం తెలిపేందుకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. అయితే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చిన సమయంలో సీనియర్లకు నామినేటెడ్ పదవులు అప్పగించారు. ఇక.. త్వరలో జెడ్పీ ఎన్నికలతో పాటు గ్రేటర్ కు ఎన్నికలు జరగాల్సి ఉంది. దీంతో.. ఆ ఎన్నికలు పూర్తయ్యాక మంత్రివర్గ విస్తరణ చేపట్టాలనేది రేవంత్ ఆలోచనగా ఉంది. అయితే, కొందరు ఆశావాహులు ఢిల్లీలో తమ వంతు లాబీయింగ్ చేస్తున్నారు. రేవంత్ మాత్రం ఎన్నికల్లో మంత్రుల పని తీరు ఆధారంగానే ప్రక్షాళన ఉంటుందని సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో.. పార్టీ హైకమాండ్ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేలా రేవంత్ కు ఫ్రీ హ్యాండ్ ఇచ్చినట్లు సమాచారం.

**రేవంత్ లెక్కలకే ఢిల్లీ ఆమోదం**

రానున్న పరిషత్ ఎన్నికలు, ఇతర రాజకీయ పరిస్థితుల కీలక సమయంలో మంత్రివర్గంలో మార్పులు చేర్పులు చేస్తే, పదవులు దక్కని వారి నుంచి అసమ్మతి వ్యక్తమై ఎన్నికలపై ప్రభావం చూపుతుందా అనే కోణంలోనూ హైకమాండ్ ఆరా తీసినట్లు సమాచారం. కేబినెట్‌లో ఇద్దరు ముగ్గురు మంత్రులకు ఉద్వాసన తప్పదనే ప్రచారం సాగుతోంది. రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రధానంగా మంత్రి పదవుల రేసులో ఉన్నారు. అయితే, రాజగోపాల్ రెడ్డికి పదవి దాదాపు లేదనేది స్పష్టం అవుతోంది. కాగా, ప్రస్తుతం ఉన్న వారిలో ఎవరిని తప్పిస్తారనే లెక్కలకు అనుగుణంగా కొత్త వారికి ఛాన్స్ దక్కనుంది. టీపీసీసీ చీఫ్ గా ప్రస్తుత కేబినెట్ మంత్రికి అవకాశం కల్పించి.. మహేష్ గౌడ్ ను తన మంత్రివర్గంలోకి తీసుకోవాలనేది రేవంత్ ఆలోచనగా చెబుతున్నారు. దీంతో.. ఢిల్లీ పర్యటన తరువాత రేవంత్ తీసుకునే నిర్ణయాల పైన ఆసక్తి నెలకొంది.

**పెద్దల సభకు ఆయనదే నిర్ణయం**

తెలంగాణలో ఎన్నికలు జరగనున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం ఇరవై మంది కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారు. హైకమాండ్ నుంచి ఓ నేత దిగుమతి అయ్యే అవకాశాలు ఉన్నాయి. రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ప్రస్తుత సభ్యులు అభిషేక్ మను సింఘ్వీ, కెఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. వీరిలో సింఘ్వీ కాంగ్రెస్ నుంచి.. సురేష్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎంపి కయ్యారు. మార్చి 16న జరగనున్న ఈ ఎన్నికల్లో శాసనసభలో ఉన్న బలాబలాల ప్రకారం ఈ రెండు స్థానాలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. పార్టీల బలాబలాల విశ్లేషణను పరిశీలిస్తే, 119 స్థానాలున్న తెలంగాణ అసెంబ్లీలో ఒక రాజ్యసభ సీటు గెలవడానికి సుమారు 40 మొదటి ప్రాధాన్యతా ఓట్లు అవసరం. కాంగ్రెస్ పార్టీకి సొంతంగా 65 మంది ఎమ్మెల్యేలు ఉండటమే కాకుండా, ఇతర పార్టీల నుండి చేరిన ఎమ్మెల్యేల మద్దతుతో రెండు స్థానాలను సులువుగా గెలుచుకునే అవకాశం ఉంది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ తన వద్ద ఉన్న సంఖ్యాబలం సరిపోకపోవడంతో ఈసారి తన స్థానాన్ని కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. బీజేపీ, మజ్లిస్ ఎవరికీ మద్దతుగా ఓట్లేసే అవకాశం లేదు. మజ్లిస్ ఒక వేళ ఓటింగ్ లో పాల్గొంటే కాంగ్రెస్‌కు సహకరిస్తుంది. అందుకే రెండు సీట్లు కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకే కాంగ్రెస్‌లో అభ్యర్థులు ఎక్కువగా పోటీ పడుతున్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి రెన్యువల్ దాదాపు ఖాయమని తెలుస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గళాన్ని వినిపించడంలో, పార్టీకి సంబంధించిన న్యాయపరమైన అంశాలను డీల్ చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఉప ఎన్నిక ద్వారా ఆయన తెలంగాణ నుంచి ఎంపి కయ్యారు, ఇప్పుడు పూర్తి కాలానికి గాను ఆయనను హైకమాండ్ మళ్ళీ బరిలోకి దింపే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.

**ఆశల్లో..**

ఇక రెండో స్థానం కోసం తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. అలాగే మాజీ మంత్రి, సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, మాజీ విసి సుదర్శన్ రెడ్డి, పార్టీలో సీనియర్ అయిన హనుమంతరావు, ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కె. కేశవరావు వంటి హేమాహేమీలు ఈ రేసులో ఉన్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం ఎవరిని వరిస్తుందో చూడాలి. సింఘ్వీ అభ్యర్థిత్వం దాదాపు ఖరారు కావడంతో, మిగిలిన ఒక్క సీటు కోసం పైరవీలు ఢిల్లీ స్థాయికి చేరుకున్నాయి. పార్టీ విధేయులకే ప్రాధాన్యత ఉంటుందని అధిష్టానం సంకేతాలు ఇస్తున్న సమయంలో, ఈ రెండో బెర్త్ ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

**సీఎం కీలకం**

ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయమే.. రాజ్యసభ అభ్యర్థి ఎంపిక విషయంలో కీలకంగా మారుతుందని భావిస్తున్నారు. వేం నరేందర్ రెడ్డి కోసం సీఎం ప్రయత్నాలు చేస్తారనే టాక్ ప్రస్తుతం ఉంది. మధుయాష్కీ, సుదర్శన్ రెడ్డికి సీఎం తరపున మద్దతు ఉండదని బహిరంగంగానే చెబుతున్నారు.

# నల్లమల మీదుగా ఆకాశ మార్గం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** శ్రీశైలం వెళ్లే భక్తులతో పాటు ఏపీకి త్వరగా చేరుకున్నేలా మన్ననూర్– శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు శ్రీకారం చుట్టుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మంగా తీసుకున్నాయి. అయితే ముందు అనుకున్న అలైన్‌మెంట్‌లో మార్పులు చోటు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. శ్రీశైలం ఆలయానికి దగ్గరగా ఎలైన్‌మెంట్ రూపొందించాలని అప్రూవల్ కమిటీ సూచించింది. మన్ననూరు చెక్‌పోస్టుకు ముందున్న బ్రాహ్మణపల్లి గ్రామం నుంచి తెలంగాణ సరిహద్దులోని ఈగల పెంట వరకు మొత్తం 55 కి.మీ. మేర ప్రస్తుతమున్న మార్గంలోనే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం ఈ మార్గంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో ఘాట్ రోడ్లు, మలుపులు అధికంగా ఉన్నాయి. కొత్తగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నందున... ఈ మలుపుల్ని వీలైనంత తగ్గించడాలని..అందుకు అవసరమైన మార్పులు చేయాలని కేంద్ర ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ తెలంగాణకు నిర్దేశించింది. దాంతో పాటు శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయానికి సమీపం నుంచి ఈ రోడ్డు వెళ్లేలా చూడాలని ఆంధ్రప్రదేశ్‌ను కోరింది. కేంద్ర ఉపరితల రవాణాశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు.. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన డీపీఆర్ కన్సల్టెంట్లు పలు ప్రత్యామ్నాయ ఎలైన్‌మెంట్‌లు, టోల్ ఆదాయ విశ్లేషణతో కూడిన నివేదికలను రెడీ చేసినట్లు తెలిసింది. ఈ నివేదికలపై త్వరలోనే అంతర్రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.

ప్రస్తుతం హైదరాబాద్– శ్రీశైలం– నంద్యాల జాతీయ రహదారి (NH–765) భాగమైన ఈ మార్గం నల్లమల అటవీ మార్గం అమ్రాబాద్ టైగర్ రిజర్వు నుంచి వెళ్తుంది. దీంతో రాత్రి వేళ ప్రయాణానికి అనుమతి లేదు. రాత్రి 8 దాటితే మన్ననూరు వద్ద చెక్ పోస్టు క్లోజ్ చేస్తారు. పగటి సమయంలోనూ వాహనాల వేగం పరిమితి సహా పలు నిబంధనలు అమల్లో ఉన్నాయి. ప్రస్తుత ఈ హైవేలో ట్రాఫిక్ అంతరాయాలు, యాక్సిడెంట్‌లు జరుగుతున్న నేపథ్యంలో టైగర్ రిజర్వు ప్రాంతంలో గ్రౌండ్ లెవల్ రోడ్డుకు బదులుగా పూర్తిస్థాయిలో ఆకాశమార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం నుంతి ప్రతిపాదన వచ్చింది. ప్రస్తుత హైవేపై ఉన్న వాహనాల ట్రాఫిక్ లెక్కల ప్రకారం.. ఈ ప్రాజెక్టు ఆర్థికంగా సాధ్యపడదని కేంద్రం ముందుగా భావించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకొచ్చి ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 33 శాతం భరిస్తామని.. సీనరేజ్, స్టేట్ జీఎస్టీని మినహాయిస్తామని ఇప్పటికే లిఖితపూర్వకంగా హామీ సైతం ఇచ్చారు. కేంద్ర ఉపరితల రవాణాశాఖలోని ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ కొద్ది రోజుల క్రితం సమావేశమైంది. ప్రాజెక్టు ఆపరేషనల్ సామర్థ్యం మెరుగుపడేలా ప్రస్తుత ఎలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలని సర్కార్ సూచించింది. ఎలివేటెడ్ కారిడార్ పొడవు తగ్గించేలా.. భక్తుల రాకపోకలకు కూడా అనుకూలంగా ఉండే విధంగా మార్గాన్ని రూపొందించాలని చెప్పింది. కారిడార్ ఎలైన్‌మెంట్‌ను శ్రీశైలం ఆలయానికి సమీపంగా రూపొందించాలని సూచనలు చేసింది.

# యువకుడిని బలితీసుకున్న రీల్స్ సరదా..

**ముద్ర, డెస్క్:**
సోషల్ మీడియా రీల్స్ పిచ్చి ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఫిబ్రవరి 3న ద్వార కా సెక్టార్–5లో తన సోదరి రీల్స్ చిత్రీకరిస్తుండగా, 17 ఏళ్ల మైనర్ అతివేగంగా నడిపిన స్కార్పియో సాహిల్ (23) అనే యువ కుడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాహిల్ మృతి చెందాడు.

ఉన్నత చదువుల కోసం బ్రిటన్ వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఏకైక కుమారుడు మరణించడంతో తల్లి ఇన్నా మాకాన్ దిక్కుతోచని స్థితిలో విలపిస్తోంది. సదరు కారుపై ఇప్పటికే 13 చలానాలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కాగా, నిందితుడికి పదో తరగతి పరీక్షల నిమిత్తం జువెనైల్ బోర్డు బెయిల్ మంజూరు చేయడంపై తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది. 'ధనవంతుల పిల్లల సరదాకు సామాన్యుల ప్రాణాలు బలి కావాలా?' అని ఆమె ప్రశ్నిస్తోంది. సోషల్ మీడియా కోసం చేసే ఇలాంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.






## రాజ్యసభ స్థానాలకు
# ఎన్నికల షెడ్యూల్ రిలీజ్

(మొదటి పేజీ తరువాయి)
విడుదల చేసింది. ఈ క్రమంలో తెలంగాణలోనూ రెండు స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి కేఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ తరపున అభిషేక్ మను సింఘ్వీ తెలంగాణ నుంచి రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిద్దరి పదవీ కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. దీంతో ఈ స్థానాలతో పాటు దేశవ్యాప్తంగా మరో 35 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

**ఈ నెల 25న నోటిఫికేషన్..**

ఈ నెల 26న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. వచ్చే నెల 5 వరకూ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. అదే నెల 6న స్క్రుటినీ, 9వ తేదీ వరకూ నామినేషన్ల విత్ డ్రాకు అవకాశం కల్పించారు. మార్చి 16న ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకూ పార్లమెంట్‌లో పోలింగ్ జరగనుండగా.. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. మార్చి 20వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా రాజ్యసభ్య ఎన్నికలు ముగియనున్నాయి.

**ఎన్నిక ఇలా..**

ఈ ఎన్నికలు ఆయా రాష్ట్రాల అసెంబ్లీ సభ్యుల ఓట్ల ద్వారా జరుగుతాయి. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఎక్కువగా ఉండటంతో ఖాళీ అయిన రెండు స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునే అవకాశం ఉంది. మొత్తంగా 37 స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. వీటిలో అత్యధికంగా మహారాష్ట్రలో ఏడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఆరు చొప్పున స్థానాలు, బిహార్‌లో నాలుగు, ఒడిశా, అస్సాంలో మూడు చొప్పున, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో రెండు చొప్పున స్థానాలు, హర్యానా, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్కొక్క స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. రాజ్యసభలో పట్టు కోసం ఈ ఎన్నికలు కేంద్రంలోని ఎన్డీయేకు కీలకం కానున్నాయి.

# హస్తినలో కలుద్దాం

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్రంలో ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, పార్టీ సాధించిన విజయంపై హైకమాండ్‌కు నివేదిక ఇవ్వడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది. పార్టీ హైకమాండే కీలక నేతలందరూ రావాలని ఆదేశించినట్లుగా చెబుతున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ రెడ్డి బృందం సమావేశం కానుంది. మున్సిపల్ ఫలితాల అనంతరం స్థానిక సంస్థలైన మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణపై వీరు చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ, మంత్రివర్గ విస్తరణ లేదా మార్పుల వంటి కీలక అంశాలపై అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ పొందే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

**పార్టీ పరమైన కీలక అంశాలపై చర్చించే చాన్స్**

పార్టీ పరమైన అంశాలతో పాటు, తెలంగాణ అభివృద్ధికి సంబంధించి కేంద్రం నుంచి అందాల్సిన సహకారంపై కూడా సీఎం దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా ఢిల్లీలో జరగనున్న AI సమ్మిట్ లో పాల్గొనడంతో పాటు, పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యే అవకాశం ఉంది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, మెట్రో విస్తరణ వంటి పనులకు నిధుల విడుదలపై ఆయన చర్చలు జరపనున్నారు.

**నామినేటెడ్ పదవుల రెండో జాబితా రెడీ?**

రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న గాసిప్స్ ప్రకారం.. ఈ పర్యటనలో కేబినెట్ విస్తరణకు సంబంధించిన సీల్డ్ కవర్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందట. ఎవరికి మంత్రి పదవులు దక్కుతాయి, ఎవరిని తప్పిస్తారు అనే ఉత్కంఠ పార్టీ నేతల్లో నెలకొంది. అలాగే, ఈ పర్యటన ముగిసిన వెంటనే నామినేటెడ్ పదవుల రెండో జాబితా విడుదల కావచ్చని సమాచారం. మున్సిపల్ ఎన్నికల్లో కష్టపడి పని చేసిన వారికి అవకాశం కల్పించనున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
19.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (HDFC Bank)
ప్రైవేట్ రంగంలో అగ్రస్థానంలో ఉన్న బ్యాంక్. డిజిటల్ సేవలు, కస్టమర్ సర్వీస్‌లో ముందంజలో ఉంటుంది.




# అంతర్జాతీయ ప్రమాణాలతో రోడ్లు

- ఆర్అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- హ్యామ్ మోడల్ పద్ధతిలో నిర్మాణం
- రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చనున్న రీజినల్ రింగ్ రోడ్డు
- ఆర్అండ్ బీ వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ రోడ్ నెట్‌వర్క్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్న ఆయన సరికొత్త ప్రతిపాదనలతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 202627 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై బుధవారం సచివాలయంలో ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాది బడ్జెట్ ఎస్టిమేట్స్ అత్యంత స్పష్టమైన ప్రణాళికతో ఉండాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గత ఏడాది నిధుల వినియోగం, పనుల పురోగతిని సమీక్షించిన ఆయన.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాపై ఎటువంటి గందరగోళం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే రీజినల్ రింగ్ రోడ్డు వంటి భారీ ప్రాజెక్టులపై ప్రధాన దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హ్యామ్ మోడల్ పద్ధతిలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు అత్యంత ముఖ్యమైన హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిని 8 లేన్లుగా విస్తరించే పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అనుమతుల కోసం త్వరలోనే ఢిల్లీ వెళ్లి సంబంధిత కేంద్ర మంత్రులను కలుస్తామన్నారు. ఈ సమీక్షలో ఆర్అండ్‌బి శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఈఎన్సీలు మోహన్ నాయక్, జయ భారతి, సీఈలు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వసంత్ నాయక్, బి.వి రావు, లింగారెడ్డి, నర్సింగ్ రావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా బుద్ధవనం

- బుద్ధుడు, అంబేద్కర్ మార్గంలో ప్రజా పాలన
- వారి ఆలోచనలే సమస్యలకు పరిష్కారం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క






**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గౌతమ బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేద్కర్ దార్శనిక మార్గంలో ప్రజాప్రభుత్వం పరిపాలన కొనసాగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బుద్ధుడు, అంబేద్కర్ లు ఆలోచనల విధానమే సకల సమస్యలకు పరిష్కార మార్గమని అయన చెప్పారు. నెక్లెస్ రోడ్ సర్కిల్ వద్దనున్న అబేద్కర్ స్మృతివనం వద్ద విశ్వశాంతిని కాంక్షిస్తూ పాదయాత్ర చేస్తున్న థాయిలాండ్, భారతీయ బౌద్ధ సన్యాసులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుద్ధవనం గురించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్న ఆయన.. అందులో భాగంగా నిధులు కేటాయించడంతో పాటు ఓఎస్డీ మల్లేపల్లి లక్ష్మయ్యను నియమించి అన్ని కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. నాగార్జున సాగర్ వద్దనున్న బుద్ధవనం చాలా అద్భుతంగా ఉంటుందనీ ప్రభుత్వం బుద్ధవనం ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. బుద్ధవనం ఒక అద్భుతమైన పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమని ఆయన చెప్పారు. బౌద్ధ భిక్షువులకు, పర్యాటకులకు అవసరమైన అన్ని సౌకర్యాలను మేము ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. నెక్లెస్ రోడ్ లోని బాబా సాహెబ్ అంబేద్కర్ సెంటర్ లో మనమంతా సమావేశం కావడం మంచి విషయమని అన్నారు. ఈ కేంద్రంలో బాబా సాహెబ్ అబేద్కర్ జీవిత చరిత్రను, వారి సందేశాలను, వారి చూపించిన మార్గాన్ని రేపటి తరాలకు తరానికి తెలియజేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. థాయిలాండ్ నుంచి 70 మంది, మరో 30 మంది భారతీయ బౌద్ధ బిక్షువులు ఫిబ్రవరి 2న కర్నాటకలోని కలబురిగి నుంచి మొదలు పెట్టిన పాదయాత్ర మార్చి 1న నాగార్జున సాగర్ లో ముగుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖమంత్రి వివేక్ వెంకట స్వామి, బుద్ధవనం ప్రాజెక్ట్ ఓఎస్డీ మల్లేపల్లి లక్ష్మయ్య, కాకి మాధవరావ్ ఐఎఎస్ (మాజీ ప్రధాన కార్యదర్శి) తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీలో స్మార్ట్ ప్రయాణం

- బస్సులో ఇతర రాష్ట్రాల మహిళల ప్రయాణానికి చెక్
- తెలంగాణ మహిళలకు వచ్చే నెల నుంచి కార్డులు
- ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ అడ్రస్‌తో ఫేక్ ఆధార్ కార్డులను తయారు చేసుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్న ఇతర రాష్ట్రాల మహిళల అక్రమాలకు చెక్ పెట్టనున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని పొందే మహిళలకు వచ్చే నెల నుంచి స్మార్ట్ కార్డు జారీ చేయనున్నట్లు వివరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ మహిళల కోసం ప్రవేశ పెట్టిన ఈ పథకం ద్వారా ఇతర రాష్ట్రానికి చెందిన మహిళలూ లబ్ధిపొందుతున్నారన్నారు. దీన్ని చెక్ పెట్టేందుకే స్మార్ట్ కార్డులు తీసుకువస్తున్నామన్నారు. ఇప్పటికే స్మార్ట్ కార్డుల నమూనాగా మూడు డిజైన్లు సిద్ధం చేశామన్న ఆయన వీటిలో నుంచి ఒకదాన్ని ప్రభుత్వం ఫైనల్ చేయనుందని చెప్పారు. స్మార్ట్ కార్డులు వచ్చాక టికెట్ జారీ చేయడం కూడా మరింత సులభం అవుతుందన్నారు.

**మార్చి నుంచి ఏసీ, ఈవీ బస్సుల్లో డిస్కౌంట్..**

వేసవి సెలవుల దృష్ట్యా వచ్చే వచ్చే నెల ఒకటో తేది నుంచి ఏసీ, మిగతా లగ్జరీ బస్సుల్లో డిస్కౌంట్ ఇవ్వబోతున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. వీటిల్లోని టికెట్ ధరలు ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరలతో సమానంగా తగ్గించే ప్రయత్నం చేస్తామన్నారు. పొల్యుష్యన్ నియంత్రించే భాగంగా ఓఆర్ఆర్ లోపల ఎలక్ట్రికల్ బస్సులే నడపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. పీఎంఈ డ్రైవ్ కింద త్వరలో రాష్ట్రానికికి 2,000 బస్సులు రాష్ట్రానికి రాబోతున్నాయన్నారు.

# ట్రిపుల్ ఆర్ కు ముందడుగు

- ఉత్తర భాగానికి పూర్తి క్లియరెన్స్
- ఈ నెలాఖరులోగా అన్ని అనుమతులు
- త్వరలోనే మొదలుకానున్న పనులు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనుల్లో ముందడుగు పడుతోంది. ఇప్పటికే కేంద్రం జాతీయ నంబర్ కేటాయించగా.. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. మరో 15 రోజుల్లో పూర్తి స్థాయి అనుమతులు వస్తాయని.. వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం 161 కి.మీ ఈ భాగం నిర్మించనున్నారు. ఉత్తర భాగం రహదారికి ఎన్ హెచ్161ఏఏ నంబరును కేటాయించింది. మరో 15 రోజుల్లో ఈ ప్రాజెక్టు పనులకు పూర్తిస్థాయి అనుమతులు కూడా వచ్చే అవకాశాలున్నాయని రాష్ట్ర అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉత్తర భాగాన్ని మొత్తం 161.5 కి.మీ. మేర 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేగా నిర్మిస్తోంది. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా తంగడ్‌పల్లి వరకు నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.20,737 కోట్లను ఖర్చు చేస్తోంది. అయితే ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం పనులపై మాత్రం సందిగ్ధత నెలకొంది. ఈ భాగం పనులను కేంద్రం చేపడుతుందా..? లేదంటే రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు తీసుకెళ్తుందా..? అనేదానిపై పూర్తి స్థాయి స్పష్టత రావడం లేదు. ఉత్తర భాగం పనులతో సమాంతరంగానే దక్షిణ భాగం పనులను చేపడతామని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఓవైపు ఈ పనులను కూడా చేపట్టాలని కేంద్రానికి విజ్ఞప్తులు చేస్తూనే.. అవసరమైతే తామే చేపడతామని రేవంత్ సర్కార్ అనేక సందర్భాల్లో వెల్లడించింది. దక్షిణ భాగం పనుల కోసం కన్సల్టెన్సీ డీపీఆర్‌నూ సైతం సిద్ధం చేసి పెట్టింది. ఇందులో మూడు ప్రతిపాదనలు చేసింది. ఫైనల్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా తంగడ్‌పల్లి నుంచి సంగారెడ్డి వరకు మొత్తం 201 కి.మీ. హైవేను గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేగా అభివృద్ధి చేయాలని డిసైడ్ అయింది. యాదాద్రి భువనగిరి, నల్గొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల మీదుగా రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగం నిర్మాణం చేపట్టాలని డీపీఆర్‌లో వెల్లడించారు. ఇందుకోసం సుమారు 2,010 హెక్టార్ల భూసేకరణ అవసరమని అధికారులు గుర్తించారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఆదిభట్ల ఏరోసిటీ ప్రాంతాలను కలిసేలా ఈ హైవే ఫైనల్ ఎలైన్‌మెంట్‌ను రూపొందించారు. NH65, 163, 44, 76, NH19 రహదారులను కలిపేలా రోడ్డును ప్రతిపాదించారు. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ దక్షిణ భాగం పనులకు సుమారు రూ.20వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా.

## వనస్థలిపురంలో దారుణం

- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ను హతమార్చిన మాజీ భర్త
- రెండో పెళ్లి చేసుకుందన్న కక్షతోనే ఈ ఘాతుకం
- పోలీసుల అదుపులో నిందితుడు

**ముద్ర, వనస్థలిపురం :**

హైదరాబాద్ వనస్థలిపురం గ్రీన్ సిటీ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. కాలనీలో నివసిస్తోన్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సునీత (30)ను ఆమె మాజీ భర్త మహేష్ అతి కిరాతకంగా హతమార్చడం కలకలం రేపింది. విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకుందన్న కక్షతోనే మహేష్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లుగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వివరాల్లోకి వెళితే.. మహేష్ విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఐదేళ్ల ఏళ్ల క్రితం సునీతతో వివాహం జరిగింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో కొన్నాళ్ల క్రితం అతనికి చట్టబద్ధంగా విడాకులు ఇచ్చేసింది. తర్వాత మరో వ్యక్తిని వివాహం చేసుకుని గ్రీన్ సిటీ కాలనీలో నివసిస్తోంది. సునీత రెండో పెళ్లిని జీర్ణించుకోలేకపోయిన మహేష్, ఆమెపై విపరీతంగా పగ పెంచుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం రెండు పదునైన కత్తులు, పెట్రోల్ డబ్బాతో సునీత నివాసంలోకి చొరబడ్డాడు. అడ్డువచ్చిన వారిని పెట్రోల్ పోసి తగలబెడతానని బెదిరిస్తూ బీభత్సం సృష్టించాడు. సునీతపై కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశాడు. కత్తిపోట్లకు ఆమె అక్కడే కుప్పకూలింది. అయినప్పటికీ సునితను వదలని మహేశ్... అక్కడే ఉన్న పూలకుండీతో తలపై బలంగా కొట్టాడు. దీంతో సునీత అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. స్థానికుల సమాచారంతో వెంటనే ఘటన స్థలానికి చేసుకున్న వనస్థలిపురం పోలీసులు నిందితుడు మహేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఆరోగ్య పథకాన్ని జర్నలిస్టులకు వర్తింపజేయాలి

**ముద్ర, తెలంగాణ:**

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం రాష్ట్రంలో త్వరలో అమలు చేయనున్న ఆరోగ్య పథకంలో జర్నలిస్టులను చేర్చి వారికి కూడా ఆ పథకం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ ప్రభుత్వాన్ని కోరారు. ఇవ్వాళ బంజారాహిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో ఆయన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిసి జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ పై చర్చించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేసిందని, అదే మాదిరిగా ప్రస్తుతం అమలు చేయాలని విరాహత్ అలీ మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు.



# స్థానిక ఫలితాలే రుజువు

- కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం లేదు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- క్షేత్ర స్థాయిలోనూ బలంగా ఉన్నాం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయమే లేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అసెంబ్లీ పోరు మొదలు తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లో హస్తం హవా కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ క్షేత్ర స్థాయిలోనూ బలంగా ఉందని స్థానిక సంస్థల ఎన్నికలు నిరూపించాయని వ్యాఖ్యానించారు. బుధవారం గాంధీ భవన్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు 67శాతం బీసీ వార్డు మెంబర్లుగా గెలిచారని చెప్పారు. 87.5శాతం ఎస్సీ, ఎస్సీ, బీసీలకు కాంగ్రెస్ టికెట్లు ఇచ్చిందన్నారు. పుర పోరులో 94 మున్సిపాలిటీలను గెలిచామంటే అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజలు సానుకూలతకు నిదర్శనం అన్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ జగిత్యాలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ల మధ్య చెలరేగిన వివాదంపై మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్... జీవన్ రెడ్డి పార్టీ సిద్ధాంతాలు, స్థానిక పరిస్థితులు, రాష్ట్ర రాజకీయాలను అర్థం చేసుకుని అర్థం చేసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు. సీట్లు, మున్సిపల్ చైర్మెన్ కౌన్సిలర్ల ఆధారంగా అక్కడ ఎంపిక జరిగిందన్నారు. అలాగే మంత్రివర్గంపై పీసీసీ జోక్యం ఉండబోదని పార్టీ చీఫ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోనే మంత్రులందరూ పని చేయాల్సి ఉంటుందన్నారు. లేదంటే అధిష్టానం ఏదైనా వివరణ కోరితేనే పీసీసీ స్పందిస్తుందన్నారు.

# పేల్చేస్తాం..

- కలకలంరేపుతున్న బాంబు బెదిరింపులు
- నాంపల్లి, రాజమండ్రి, కరీంనగర్ కోర్టులకు ఫేక్ మెయిల్స్
- రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్
- ముమ్మర తనిఖీలు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కోర్టులకు బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. నాంపల్లి, రాజమండ్రి, కరీంనగర్ ప్రాంతాల్లోని కోర్టుల్లో బాంబులు పెట్టామని అగంతకుల నుంచి ఈమెయిల్స్ అందాయి. తాము అమర్చిన ఆర్డీఎక్స్ బుధవారం మధ్యాహ్నం 12:05 గంటలకు పేలుతాయని అగంతకులు అందులో పేర్కొన్నారు. దీంతో ఆయా కోర్టుల్లో తీవ్ర ఆందోళన రేపింది. వెంటనే రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్ కోర్టుల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీల తర్వాత ఇదంతా ఉత్తదే అని తేల్చారు. అగంతకుల నుంచి వచ్చిన బెదిరింపు ఈమెయిల్స్ తమిళనాడు పోలీసు సిబ్బంది పేరుతో రావడం సంచలనంగా మారింది. ఈ మెయిల్ లో అగంతకులు పలు ఆరోపణలు చేశారు. ఇందులో తమిళనాడు కానిస్టేబుళ్లకు తీవ్ర అవమానాలు జరుగుతున్నాయని తమ చేత నివేతా పేతురాజ్, డీఎంకే నేతల ఉంపుడు గత్తెల బట్టలు, వారి ఇళ్లలోని మురికి పాత్రలను బలవంతంగా శుభ్రం చేయిస్తున్నారని ఆరోపించారు. తమిళనాడులో కానిస్టేబుళ్ల కోసం 1979 నైనార్ దాస్ పోలీస్ యూనియన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు ఈ సందేశంలో పేర్కొన్నారు. తమ డిమాండ్లు వినిపించడానికి మరో మార్గం లేదని అందుకే బాంబు పేలుళ్లకు పాల్పడుతున్నామని పేర్కొన్నారు. సీ4 ఆర్డీఎక్స్ తో తయారు చేసిన 3 ఆర్డీఎక్స్ ఐఈడీలు ఇప్పటికే న్యాయమూర్తి/కోర్టు ప్రాంగణంలోని కీలక ప్రాంతాల్లో అమర్చబడ్డాయని చెప్పారు. మధ్యాహ్నం సమయంలో కోర్టు కార్యాలయం వద్దకు ఒకరిద్దరు సభ్యులు సమీపిస్తారన్నారు. క్యూబ్రాంచ్‌ఐఎస్ఐ సభ్యులు రిమోట్ కంట్రోల్ ట్రిగ్గర్లు తీసుకుని ప్రాంగణానికి 100 అడుగుల లోపలికి రాగానే ఐఈడీలు వాటంతట అవే పేలిపోతాయని తెలిపారు.

**అవి పేలకపోతే మా సభ్యులే పేల్చుకుంటారు..**

ఏదైనా కారణంగా అవి పేలని పక్షంలో మా సభ్యులే భవనంలోకి వచ్చి శ్రీలంక ఈస్టర్ ఆపరేషన్ తరహాలో సిబ్బందితో కలిసి తమను తాము పేల్చుకుంటారని బెదిరించారు. ఏపీ కోర్టు సులభమైన లక్ష్యం అని ఎట్టి పరిస్థితుల్లో మా డిమాండ్లు వినిపిస్తామంటూ మెయిల్ చేశారు. ఆకాశ్ భాస్కరన్ పట్టుబడితే, నివేతా పేతురాజ్ కూడా పట్టుబడుతుంది. కాబట్టి, దానికి ముందు ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని పేర్కొన్నారు. అరుణ్ కుమార్, సున్నియా దాస్ ప్రసాద్ మాజీ క్యూ బ్రాంచ్ (సీబీసీఐడీ II) ఇన్స్పెక్టర్ (86వ బ్యాచ్) నాగపట్టణం పేరుతో ఈ బెదిరింపు మెయిల్ పోలీసులకు చేరింది. అయితే నిజంగానే ఇదితమిళనాడు పోలీసులకు జరుగుతున్న అవమానాల విషయానికి సంబంధించిందేనా లేక ఎవరైనా అగంతకులు ఇలా చేశారా అనేది పోలీసుల విచారణలో తేలనుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
19.02.2026 గురువారం, హైదరాబాద్

# 4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## దర్శక రుషి...అసమాన యశస్వి...
# కళాతపస్వి విశ్వనాథ్

**ఫిబ్రవరి 19 దిగ్గజ దర్శకుడు కే.విశ్వనాథ్ జయంతి**

**కళలకి కిరీటం పెట్టి... విలువలకి పెద్ద పీట వేసి... తెలుగు చిత్రానికి 'స్వాతి ముత్యం'... 'స్వర్ణ కమలం'తో సొబగులద్ది మురిపించిన సినీ పిపాసి మన కళా తపస్వి! ఆధునికత పేరుతో ఎటో వెళ్లిపోతున్న సినీ పోకడకి నేర్పుగా కళ్లెం వేసి... 'కాలం మారింది' కానీ మరవకూడని మన మూలాలు ఇవిగో అంటూ అందులోని గొప్పదనాన్ని చూపించిన సినీ దార్శనికుడు కాశీనాథుని విశ్వనాథుడు.**



తెలుగు సినిమా దర్శకునిగా ప్రశస్తమైన సినిమాలను సృష్టించి, తెలుగు సినిమాకు ఒక గౌరవాన్ని, గుర్తింపును తెచ్చిన వ్యక్తి. సౌండ్ రికార్డిస్టుగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టాడు.ఆదుర్తి సుబ్బారావు దగ్గర కొన్నాళ్ళు సహాయ దర్శకుడిగా పనిచేశాడు. అక్కినేని నటించిన ఆత్మ గౌరవం సినిమాతో విశ్వనాథ్ దర్శకుడిగా మారాడు.ఈ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది బహుమతి లభించింది.ఆయన సినీ జీవితంలో పేరెన్నికగన్న చిత్రం శంకరాభరణం. ఇది జాతీయ పురస్కారం గెలుచుకుంది. భారతీయ కళల నేపథ్యంలో ఆయన తీసిన చిత్రాలు శంకరాభరణం, సాగరసంగమం,శృతిలయలు, సిరివెన్నెల, స్వర్ణకమలం, స్వాతికిరణం ప్రధామైనవి. సాంఘిక సమస్యలను ప్రస్తావిస్తూ ఆయన తీసిన చిత్రాల్లో సప్తపది, స్వాతిముత్యం, స్వయంకృషి, శుభోదయం, శుభలేఖ, ఆపద్బాంధవుడు, శుభ సంకల్పం ముఖ్యమైనవి. దర్శకుడిగా జోరు తగ్గాక సినిమాల్లో నటించడం మొదలుపెట్టాడు.

విశ్వనాథ్ స్వస్థలం గుంటూరు జిల్లా, రేపల్లె తాలూకాలోని పెద పులివర్రు అనే గ్రామం.బాల్యం,ప్రాథమిక విద్య పెదపులివర్రులోనే గడిచినా ఆ ఊర్లో ఎక్కువ రోజులు నివసించలేదు. అక్కడి నుంచి వారి నివాసం విజయవాడకి మారింది. ఉన్నత పాఠశాల విద్య అంతా విజయవాడలోనూ, కాలేజీ విద్య గుంటూరు హిందూకాలేజీ, ఎ.సి కాలేజీల్లోనూ జరిగింది. బి.ఎస్సీ డిగ్రీ చేశాడు.

ఒక స్టూడియోలో సౌండ్ రికార్డిస్టుగా సినిమా జీవితాన్ని మొదలుపెట్టాడు. అన్నపూర్ణ సంస్థ నిర్మించిన తోడికోడళ్ళు అనే సినిమాకు పనిచేస్తున్నపుడు దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుతో పరిచయం ఏర్పడి ఆయన వద్ద సహాయకుడిగా చేరాడు. ఆయనతో కలిసి అన్నపూర్ణ వారి ఇద్దరు మిత్రులు,చదువుకున్న అమ్మాయిలు,డాక్టర్ చక్రవర్తి సినిమాలకు సహాయ దర్శకుడిగా పనిచేశాడు. అప్పటికే ఆయన ప్రతిభను గుర్తించిన అక్కినేని నాగేశ్వరరావు తర్వాత సినిమాకు దర్శకుడిగా అవకాశం ఇస్తానని వాగ్దానం చేశాడు.అలా డాక్టర్ చక్రవర్తి తర్వాత అక్కినేని నాయకుడిగా నిర్మించిన ఆత్మ గౌరవం సినిమాతో విశ్వనాథ్ దర్శకుడిగా మారారు. అప్పట్లో ఆకాశవాణి హైదరాబాదులో నిర్మాతగా ఉన్న గొల్లపూడి మారుతీరావు,రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి ఈ సినిమాకు కథను సమకూర్చగా, భమిడిపాటి రాధాకృష్ణ,గొల్లపూడి కలిసి మాటలు రాశారు. దుక్కిపాటి మధుసూదనరావు స్క్రీన్ ప్లే రాశాడు. ఈ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది బహుమతి లభించింది. సిరిసిరిమువ్వ సినిమాతో ఆయన ప్రతిభ వెలుగులోకి వచ్చింది. కె విశ్వనాథ్ మొత్తం 60 సినిమాలకు దర్శకత్వం వహించారు ఆయన జేవీ సోమయాజులతో చేసిన శంకరాభరణం బ్రహ్మాండమైన విజయాన్ని సాధించింది ఈ సినిమాతోనే కె విశ్వనాథ్ దర్శకుడుగా పేరు సంపాదించాడు కే విశ్వనాథ్. ఈయన కెరీర్ లో అనేక పురస్కారాలు వరించాయి వాటిలో 1992 లో రఘుపతి వెంకయ్య పురస్కారం,పద్మశ్రీ పురస్కారం, 2016 లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం.2017 లో జీవిత సాఫల్య పురస్కారం రోటరీ క్లబ్ జీవిత సాఫల్య పురస్కారం2021 లో సైమా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2022 లో జీవిత సాఫల్య పురస్కారం లభించాయి. వయసు రీత్యా వచ్చిన అనారోగ్య సమస్యలతో విశ్వనాథ్ గారు బాధపడుతూ 2021 ఫిబ్రవరి 2 ఆయన ఈ లోకాన్ని విడిచి వెళ్ళారు.



సుధాకర్.ఏ.వి
9000674747

# కొత్తగూడెంలో చరిత్ర సృష్టించిన సిపిఐ!

## మేయర్ గా ఎన్నికైన ఆటో డ్రైవర్!

**వందేళ్ళ చరిత్రగల సిపిఐ తెలంగాణలో చరిత్ర సృష్టించింది. ఇటీవలే ఖమ్మంలో ఘనంగా లక్షల మందితో శతాబ్ది ఉత్సవాలు జరుపుకున్న సిపిఐని ఇటీవల కొత్తగా ఏర్పాటయిన కొత్తగూడెం కార్పొరేషన్ కు మేయర్ పదవి అలంకరించింది. తెలంగాణలో తొలి మేయర్ గా పీఠమెక్కిన సిపిఐ నేత మూడు గణేష్ (33)ఎస్టి అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు నమోదు చేశారు. కుటుంబ జీవనం కోసం ఆటోడ్రైవర్ గా జీవనం సాగిస్తున్న మూడు గణేష్ సొంతూరు సుజాతనగర్ మండలం కోమటిపల్లి గ్రామము. ఈ మండలంలో కొన్ని గ్రామమాలను కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటుతో కొత్తగూడెంలో చేర్చారు. కొత్తగూడెం గతంలో మున్సిపాలిటీగా ఉండేది.**



కూనంనేని సాంబశివరావు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం నుంచి శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత పక్కనే అనేక దశాబ్దాలుగా ట్రైబల్ ఏజెన్సీ ఉన్న పాల్వంచ మునిసిపాలిటీకి ఎన్నికలు జరపాలంటే కార్పొరేషన్ ఏర్పాటు ఒకటే ప్రత్యామ్నాయమని భావించి కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చకాచగా పావులు కలిపారు. పాల్వంచ,కొత్తగూడెం తో పాటు సుజాతనగర్ లోని కొన్ని ప్రాంతాలను కలుపుతూ స్థానికులను ఒప్పించి మెప్పించి ఏజెన్సీ చట్టాలు అడ్డు తొలగించుకుంటూ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంలో ఆయన సఫలీకృతమయ్యారు.కార్పొరేషన్ ఏర్పాటు అయిన తర్వాత ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది.

**కొత్తగూడెం కార్మిక ఉద్యమాలకు కేంద్రం:-**
కమ్యూనిస్టు పార్టీకి కొత్తగూడెం ప్రాంతంలో ఆది నుంచి పట్టుంది. నైజాంపాలనలోనే కొత్తగూడెం ప్రాంతంలో బొగ్గు గనుల అన్వేషణ.. బొగ్గు తీయటం ప్రారంభమైంది. కార్మిక సంఘాలు నిషేధం ఉన్న కాలంలోనే రహస్యంగా ఉన్న కమ్యూనిస్టు ఉద్యమ నేతలు బొగ్గు గనులలో పనిచేయు కార్మికులను సంఘటితం చేయటం, సంఘాలు ఏర్పాటు చేయటం 1946 నుండే కమ్యూనిస్టు నాయకులు కార్యక్రమాలు మొదలుపెట్టారు. కీర్తిశేషులు దేవూరి శేషగిరిరావు,దేవబట్ల రామనాథం గారలు కార్మిక సంఘాలు ఏర్పాటు చేయటంలో ప్రముఖ పాత్ర వహించారు.1952 లో జరిగిన జనరల్ ఎన్నికల్లో కొత్తగూడెం నుండి కమ్యూనిస్ట్ నాయకులను అసెంబ్లీ కి పంపించారు.

కొత్తగూడెం మున్సిపాలిటీ ఏర్పాటైన నాటినుండి పాలకులుగా ఎవరున్నా బలమైన ప్రతిపక్షంగా కొత్తగూడెం మున్సిపాలిటీలో సిపిఐ తన పాత్రను పోషించింది. గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో దివంగత నేత సిపిఐ నాయకులు బరిగెల సాయిలు, ప్రస్తుత సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషాలు కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ గా పని చేశారు.1987 లో కొత్తగూడెం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుని కి ప్రత్యక్షంగా జరిగిన ఎన్నికల్లో నేటి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఎన్నికయ్యారు. 2009 అసెంబ్లి ఎన్నికల్లోగూడ టీడీపీ అలయన్స్ లో కొత్తగూడెం నుంచి కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. క్షేత్రస్థాయిలో బలమైన పునాదులు ఉన్న కొత్తగూడెం తో పాటు కూనంనేని సాంబశివరావు శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత పారిశ్రామిక కేంద్రమైన పాల్వంచలో పార్టీ త్వరితగతిన విస్తృతమైంది. గతేడాది చివరిలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పాల్వంచ మండలంలో ఎవరు ఊహించని రీతిలో గ్రామపంచాయతీలను సిపిఐ గెల్చుకుంది. పాల్వంచ పట్టణం ఒకవిలక్షణమైంది. వేలాదిమంది పారిశ్రామిక కార్మికులు పట్టణముతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మైగ్రేషన్ వర్కర్స్ ఉంటారు. ఇక్కడ పార్టీని బలోపేతం చేయడం అంత తేలిక కాదు.కొంత మధ్యతరగతితో పాటు గ్రామీణ కార్మికులు తో కలగలిపిన ఈ ప్రాంతంలో సిపిఐ ఏఐటీయూసీ కార్మిక సంఘాలు ఏర్పాటులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా, కొత్తగూడెం శాసనసభ్యులుగా కూనంనేని ప్రత్యేక దృష్టి సారించి బలమైన ప్రజా సంఘాల ఉద్యమ కేంద్రంగా తీర్చిదిద్దారు.

సుజాతనగర్ ప్రాంతం ఆదినుంచి కమ్యూనిస్టు పార్టీకి పట్టుంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ ఎన్నికలు రావడంతో సహజంగానే సిపిఐ బలమైన రాజకీయ పార్టీగా బరిలోకి దిగింది. మిత్రపక్షమైనా కాంగ్రెస్తో సంప్రదింపులు జరిపినప్పటికీ సీట్ల పంపిణీలో చెరిసగం కోరగా.. చివరికి కనీసం 25 స్థానాలు సీపీఐ కి ఇవ్వాలని కోరినప్పటికీ కాంగ్రెస్ ఒప్పుకోక పోవడంతో స్వతంత్రంగా పోవాలని జిల్లా పార్టీ నిర్ణయించింది. పోటీపై కొన్ని సమస్యలు తలెత్తాయి. ఈ పరిస్థితుల్లో సిపిఐ ఎక్కడ మిత్రభేదానికి తావివ్వకుండా భారత రాష్ట్ర సమితి మిత్రుత్వానికి చేయి చాపి కలిసి పోటీ చేద్దామని పలుమార్లు ఆహ్వానించిన కలిస్తే మిత్రపక్షమైన కాంగ్రెస్తో లేదంటే ఒంటరిగానే బరిలోకి అని సిపిఐ తేల్చి చెప్పింది. చెప్పిన విధంగానే తెలుగుదేశంతో కలిసి కార్పొరేషన్ ఎన్నికల బరిలోకి దిగింది. అధికారపక్షంగా పోటీలో ఉన్న కాంగ్రెస్తోనూ రాష్ట్రంలో ప్రధాన పత్రిక ఉన్న టిఆర్ఎస్ ను తట్టుకొని 22 స్థానాల్లో విజయం సాధించడం తోపాటు మరో స్థానంలో స్వతంత్ర అభ్యర్థిని గెలిపించుకుంది.8 మంది కార్పొరేట్లున్న బిఆరెస్ సిపిఐ కి మద్దతు ప్రకటించింది.

అయితే రాష్ట్రంలో.. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో లౌకిక శక్తుల ఐక్యత రాజ్యాంగ పరిరక్షణతో పాటు మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన నేపథ్యంలో కాంగ్రెస్తో పని చేయాల్సి ఉన్నందున సిపిఐ కార్పొరేషన్ మేయరు ఎన్నిక విషయంలో తిరిగి కాంగ్రెస్తో సంప్రదింపులు జరిపింది. సిపిఐ రాష్ట్ర నాయకత్వం చొరవచేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోను, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తోను ఉభయ పార్టీల ప్రతినిధులు చర్చలు జరిపారు. ఇరుపక్షాలు చర్చల అనంతరం ఏకాభిప్రాయానికి వచ్చారు. కాంగ్రెస్ 22 స్థానాల్లో గెలవగా సిపిఐ కూడా 22 స్థానాలు గెలుపొందింది. చెరి రెండున్నర ఏండ్లు మేయర్ డిప్యూటీ మేయర్ పదవులను స్వీకరించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం నేపథ్యంలో ఈ నేల 16 న జరిగిన మేయరు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ రఘురాంరెడ్డి తో పాటు ఆ పార్టీకి చెందిన 22 మంది కార్పొరేటర్లు స్థానిక శాసనసభ్యులతో పాటు సిపిఐ నుంచి గెలుపొందిన 22 మంది సభ్యులు మేయరు ఎన్నికల్లో పాల్గొన్నారు. 20 వార్డు నుంచి సిపిఐ కార్పొరేటర్ గా గెలుపొందిన మూడు గణేష్ (ఎస్ టి)మేయర్ గా, కాంగ్రెస్ పార్టీకి చెందిన సిరిపురం లలిత కుమారిని డిప్యూటీ మేయరుగా ఎన్నుకున్నారు.

కమ్యూనిస్టు పార్టీ మేయర్ స్థానాన్ని అధిష్టించింది ఇది కమ్యూనిస్టు శ్రేణులకు ఒక సరికొత్త ఊపునిచ్చింది. ఎన్నికల వ్యవస్థలో ధన ప్రభావం పెరిగిపోతున్న నేపథ్యం లో కమ్యూనిస్టులు ప్రభావం చూపలేకపోతున్న దశలో ఈ గెలుపు భవిష్యత్తుకు ఒక స్ఫూర్తి దాయకంగా నిలవనుంది. ఒకపక్క లౌకిక, రాజ్యాంగ, ప్రజల హక్కుల పరిరక్షణకు శ్రమిస్తూనే మరొక పక్క ప్రజా సమస్యల పరిష్కారానికి రాజులేని పోరాటం నిర్వహిస్తున్న సిపిఐ మేయరు పదవిని ఆదిష్ఠించడం ద్వారా కమ్యూనిస్టు శ్రేణులకు ఒక నూతన శక్తిని ఇచ్చింది. ఒంటరిగా పోటీ చేయడం తర్వాత ఒక అద్భుత విజయాన్ని సాధించడం ఆ విజయాన్ని మేయర్ పదవిని అదిస్టించడం ద్వారా సంపూర్ణం చేయడం అనేది ఒక చారిత్రక ఘటన.వందేళ్ళ చరిత్ర పూర్తి చేసుకున్న సిపిఐకి మేయర్ గా ఒక సమాన్యమైన ఆటో కార్మికున్నికి అరుదైన అవకాశం మూడు గణేష్ కు దక్కింది. తెలంగాణలో సిపిఐ నేత నగర' ప్రథమ పౌరుడి' గా ఎన్నిక కావడాన్ని వామపక్ష ప్రజాస్వామిక వాదులు స్వాగతం చెబుతున్నారు.



ఉజ్జిని రత్నాకర్రావు
9490952646
సీపీఐ రాష్ట్ర సీనియర్ నేత

# బడ్జెట్‌లో విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలి

**రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేవలం 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించి తమ హామీని తామే తుంగలో తొక్కిందని అన్నారు. అదేవిధంగా గత సంవత్సరం 2025-26 మార్చిలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో కూడా అతి తక్కువ శాతం నిధులు 7.57 శాతం నిధులు మాత్రమే కేటాయించడం జరిగిందనీ వారన్నారు.**



అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక్కో నియోజకవర్గానికి 250 కోట్లు కేటాయించి ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తానంటున్న ప్రభుత్వం ఇప్పుడున్న జిల్లాపరిషత్, ప్రభుత్వ పాఠశాలలకు అరకొర నిధులు కేటాయిస్తూ నిర్లక్ష్యం చేయడం తగదని వారన్నారు.

తమది ప్రజా ప్రభుత్వం అనీ, గత బిఆర్ఎస్ పాలకులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ బడులకు మహర్దశ తీసుకువస్తామని ఇకనుండి బడ్జెట్లో విద్యకు 15% నిధులు కేటాయిస్తామని ప్రకటించింది. కానీ అందుకు భిన్నంగా గత రెండు బడ్జెట్లలో విద్యకు కేటాయించిన నిధులు 7.3 శాతం, 7.57 శాతం మాత్రమే నని ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టే బడ్జెట్లో నైనా కనీసం 20 శాతం తగ్గకుండా నిధులు కేటాయించి విద్యారంగం పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ బడుల వసతుల కల్పనలో జాతీయస్థాయిలో 36 రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం 32వ స్థానంలో ఉంది. నాణ్యమైన విద్య, సమర్థవంతంగా బడుల నిర్వహణలో 27వ స్థానంలో ఉందని రాష్ట్ర ప్రభుత్వము నియమించిన తెలంగాణ విద్యా కమిషనే తెలిపింది. మరి అలాంటి పరిస్థితుల్లో కమీషన్ రిపోర్టును కూడా పరిగణన లోనికి తీసుకోకుండా తక్కువ బడ్జెట్ కేటాయించడం పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు చదివే బడులను నిర్లక్ష్యం చేయడం తప్ప మరేం కాదు. కాబట్టి ఈ సారైనా నేడున్న ప్రభుత్వ బడుల స్థితిని మెరుగు పరిచే విధంగా బడ్జెట్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తానంటున్న ఒక్కో ఇంటర్నేషనల్ స్కూలుకు కేటాయించే 250 కోట్లతో ఒక్కో జిల్లాలో ఉన్న ప్రభుత్వ స్కూళ్లన్నింటినీ అద్భుతంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు.

ఇప్పటికీ రాష్ట్రంలో దాదాపు 650 గురుకులాలకు నేటికీ స్వంత భవనాలు లేవు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక హాస్టళ్లకు కూడా స్వంత భవనాలు లేక ప్రయివేట్ భవనాల్లో కొనసాగుతున్నవి. కోట్లాది రూపాయలు అద్దెల రూపంలో ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్ ఏడాదికేడాది పెరుగుతుంది. విద్యకు అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించి ప్రజలకు ఈ పాఠశాలల పట్ల నమ్మకం, విశ్వాసం కల్పించాల్సిన ప్రభుత్వము విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల పాఠశాలలకు మౌళిక వసతుల లేమి కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన పిల్లలు కూడా ప్రయివేట్ బాట పట్టే పరిస్థితి ఏర్పడిందని బాలల హక్కుల సంక్షేమ సంఘం భావిస్తుంది. అటు ప్రయివేట్ పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులు ఏటికేడు పెరుగుతున్న ఫీజుల భారంతో సతమతం అవుతున్నారు. ప్రయివేట్ పాఠశాలల ఫీజులను కూడా ప్రభుత్వం నియంత్రించడంలో మీనమేషాలు లెక్కిస్తుందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యకు 20 శాతం నిధులు కేటాయించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ బడులపట్ల విశ్వాసం పెంపొందించి ఎన్ రోల్మెంట్ పెంచుటకు ప్రభుత్వం కృషిచేయాలని అన్నారు.

1966 లో నియమించిన భారతీయ విద్యా కమిషన్(కొఠారి కమిషన్) సూచించిన విధంగా రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులను కేటాయించాల్సి ఉందని కానీ ఈ సారి ప్రవేశపెట్టే బడ్జెట్లో కనీసం 20 శాతం నిధులనైన కేటాయించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తుంది.



ఇంజమూరి రఘునందన్,
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
బాలల హక్కుల సంక్షేమ సంఘం(BHSS)
సెల్: 9866102962

# నయానా? భయానా?
## (సామ దాన భేద దండోపాయాలు)

అతిప్రేమను ఒలకబోసి
అంతరంగాలను అదుపులోకి తీసుకొని ఆటలాడించటం -
మంచిమాటల మల్లెలు చల్లి మనసులు గెలిచి
సొంత పనులు చక్కబెట్టుకోవటం
– సామోపాయం.

బహుమతులు పంచిపెట్టి ప్రలోభాలకు గురిచేసి
బుద్ధిని బంధించి తనదారికి తిప్పుకోవటం
ధనాన్ని ఇచ్చి కోరికలను నెరవేర్చి
తలలను వంచేలా చేసి ఆశయాలు సాధించటం
- దానోపాయం.

సన్నిహితుల మధ్య అపార్థాలు కలిగించి
అనుకున్న కార్యాలు సాధించటం
బుద్ధిబలం ఉపయోగించి అంతఃకలహాలు రగిలించి
విధిలేని పరిస్థితులు సృష్టించి వశంచేసుకోవటం
- భేదోపాయం.

అన్యగతిలేని సందర్భాలు కల్పించి
బలప్రయోగమైనా చేసి తలచినది నెరవేర్చుకోవటం -
హెచ్చరికలతో హింసతో హృదయాలను గడ్డకట్టించి
కత్తులు చూపి బెదిరించైనా కాళ్లదగ్గరకు తెచ్చుకోవటం
- దండోపాయం.

సామమా, దానమా, భేదమా, దండమా
ఏ దారిలో నడిచినా సాధించేది గమ్యమా?
మనిషిని మానవత్వాన్ని కోల్పోవడమా?
అడ్డదారులు తొక్కి అందుకునేది విజయమా?
- నయానో.. భయానో?

చరిత్ర చివర అడుగుతుంది-
నీ అభిష్టం నెరవేరిందా?
నీ జీవితం నెగ్గిందా?
నీ సామ్రాజ్యం నిలిచిందా?
- నయంతోనైనా.. భయంతోనైనా..?



గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

ఐసీఐసీఐ బ్యాంక్ (ICICI Bank)
ప్రైవేట్ బ్యాంకింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. రిటైల్ మరియు కార్పొరేట్ లోన్స్‌లో బలమైన స్థానం కలిగి ఉంది.



# ఎండిటితో కుష్టు వ్యాధి పూర్తిగా నయం

- ఆలస్యంగా గుర్తిస్తే శాశ్వత వైకల్యం
- ఎన్‌హెచ్‌ఆర్‌సి లెప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

కుష్టు వ్యాధి పూర్తిగా నయం చేయగలిగిన వ్యాధి అని, సమయానికి మెరుగైన ఔషధ చికిత్స (ఎండిటి) అందిస్తే పూర్తి స్థాయిలో నివారణ సాధ్యమని ఎన్‌హెచ్‌ఆర్‌సి లెప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్ తెలిపారు. ఈ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టి రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం రంగారెడ్డి జిల్లాకు ఆయన విచ్చేశారు. జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. కుష్టు వ్యాధి నియంత్రణ చర్యల అమలు, బాధితుల మానవ హక్కుల పరిరక్షణ అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిగ్రస్తుల హక్కులు, గౌరవం, సామాజిక సమానత్వాన్ని రక్షించడం ఎన్‌హెచ్‌ఆర్‌సి ముఖ్య బాధ్యత అని అన్నారు. వ్యాధి ఆలస్యంగా గుర్తిస్తే శాశ్వత వైకల్యానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కుష్టును కేవలం వైద్య సమస్యగా కాకుండా అపోహలు, సామాజిక వివక్షతో ముడిపడిన సామాజిక సమస్యగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా లెప్రసీ బాధితులకు అందుతున్న వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, జిల్లాలో కుష్టు నియంత్రణ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బాధితుల వివరాలు, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలపై శాఖల వారీగా సమీక్షించారు. కుష్టు వ్యాధి కార్యక్రమం జాయింట్ డైరెక్టర్ డా.జాన్ బాబు, వ్యాధి వ్యాప్తి విధానం, లక్షణాలు, చికిత్స, నియంత్రణలో అందరి పాత్రపై విశదీకరించారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.పాపారావు వందన సమర్పణతో సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఇతర శాఖల జిల్లా అధికారులు, జిల్లా ప్రాజెక్ట్ అధికారి, డా.అంబికా, ఇబ్రహీంపట్నం ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.లక్ష్మి ప్రసన్న, జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన, డిప్యూటీ పారా మెడికల్ అధికారులు పాల్గొన్నారు.





## ‘విద్వేష ప్రచారాలు దేశ ఐక్యతకు ముప్పు’

**ముద్ర, కాప్రా:**

మేడారం సమ్మక్కసారక్క జాతరలో చోటు చేసుకున్న ‘కోవా-బన్ను’ వివాదం వంటి ఘటనలు, వాటి చుట్టూ జరుగుతున్న ప్రచారాలు దేశ ఐక్యతకు, భద్రతకు ప్రమాదకరమని జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ పాషామియా అన్నారు. బుధవారం కాప్రా, జవహర్ నగర్, జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెన్నాపురందేవేందర్ నగర్ ప్రాంతాల్లో వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సామాజిక బాధ్యతను విస్మరించి, భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తూ ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేసేలా ప్రవర్తిస్తున్న వారిపై పోలీసు అధికారులు, పాలకులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇదే విధమైన విద్వేష సంస్కృతి దేశవ్యాప్తంగా వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జవహర్ నగర్ బీఎస్పీ అధ్యక్షుడు కలకోట ప్రభాకర్, అభ్యుదయ రచయిత షేక్ మీరా, ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు వై.మల్లేష్, ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి, పీఓడబ్ల్యూ(విముక్తి) ప్రతినిధి పెర్క సునీత, ఆప్ తెలంగాణ ఫౌండర్ మహమ్మద్ మోయుద్దీన్, కమిటీ సభ్యులు మహమ్మద్ సోహెల్, మహమ్మద్ గౌస్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి : డీసీపీ

**ముద్ర, కూకట్‌పల్లి :**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో ముస్లిం మతపెద్దలు, యువకులతో మర్యాదపూర్వక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి డీసీపీ రీతి రాజ్ హాజరై మాట్లాడారు. పండుగల సమయంలో మతసామరస్యం, శాంతి, పరస్పర సహకారం అత్యంత ముఖ్యమని ఆమె అన్నారు. ప్రార్థనలు, పండుగ కార్యక్రమాలు సజావుగా సాగేందుకు పోలీసు శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. మసీదులు, ప్రార్థనా స్థలాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇఫ్తార్, ప్రత్యేక ప్రార్థనల సమయంలో రవాణా ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వ్యాపించే పుకార్లను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న మతపెద్దలు, యువకులు శాంతిభద్రతల పరిరక్షణలో తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## సీసీ రహదారి పనుల పరిశీలన

**ముద్ర, శేరిలింగంపల్లి :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో రూ.48లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రహదారి నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కాలనీ వాసులు, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో కాలనీ వాసులకు ఇబ్బందులు కలగకుండా స్థాయిలను సరిచూసుకుంటూ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నిఖిల్, గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివ సింగ్, సీనియర్ నాయకులు మల్లేష్, శ్రీకాంత్ రెడ్డి, ఉమేష్, శేఖర్, సింగ్, సుమన్, తుకారాం, మహేందర్, శ్రీకాంత్, నగేష్, అరవింద్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్






- పోటీలను ప్రారంభించిన డీజీపీ శివధర్ రెడ్డి

**ముద్ర, శేరిలింగంపల్లి :**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘నాల్గవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడా మరియు ఆటల మీట్-2026’ శుక్రవారం సైబరాబాద్ పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పోటీలను ప్రారంభించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్ క్రీడా జ్యోతిని అందించగా, డీజీపీ దానిని వెలిగించారు. అందెశ్రీ రచించిన “జయ జయహే తెలంగాణ” గీతం ఆలాపనతో మైదానం మారుమోగింది. లాంఛనాల మధ్య గన్ ఫైర్ చేసి, బెలూన్లు ఎగురవేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో గ్లోబల్ సమ్మిట్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల బందోబస్తు, సమ్మక్క-సారక్క జాతర వంటి కార్యక్రమాలను పోలీసులు సమర్థంగా నిర్వహించారని డీజీపీ అభినందించారు. క్రీడలు శారీరకమానసిక దృఢత్వాన్ని పెంచి జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, మహిళా పోలీసుల భాగస్వామ్యం పెరగాలని సూచించారు. సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 2,532 మంది క్రీడాకారులు, అందులో 300 మంది మహిళలు పాల్గొనడం విశేషమన్నారు. మొత్తం 31 క్రీడా విభాగాల్లో పోటీలు జరుగుతుండగా, మహిళలకు 14 విభాగాలు కేటాయించామని తెలిపారు. జాతీయ స్థాయి విజేతలకు బంగారు పతకానికి రూ.3లక్షలు, రజతానికి రూ.2లక్షలు, కాంస్యానికి రూ.1లక్ష నగదు ప్రోత్సాహకంతోపాటు ఇంక్రిమెంట్లు అందజేస్తామని వెల్లడించారు. మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌లను నేరుగా డీఎస్పీలుగా నియమించడం గర్వకారణమని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన పలువురు క్రీడాకారులను పతకాలతో సన్మానించారు. పోలీస్ వెల్ఫేర్ అండ్ వెల్నెస్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను డీజీపీ సతీమణి హేమ శివధర్ రెడ్డి ప్రారంభించారు. వ్యాయామ పరికరాలు, సైకిళ్లు, ప్రభుత్వ నేచర్ క్యూర్ ఆసుపత్రి, సంప్రదాయ వంటకాల స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శనివారం వరకు ప్రదర్శన కొనసాగనుంది.

## నేడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి

- హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర

**ముద్ర, తాండూర్ :**

మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన హిందూ హృదయ సమ్రాట్, మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతిని తాండూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించాలని హిందూ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని కాళికాదేవి దేవాలయం వద్ద నుంచి మధ్యాహ్నం 3గంటలకు శోభాయాత్ర ప్రారంభమై వినాయక చౌక్, ఇందిరా చౌక్ మీదుగా శివాజీ చౌక్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తాండూర్ పరిసర గ్రామాల నుంచి హిందువులు భారీగా హాజరుకావాలని కోరారు. భజరంగ్ దళ్, హిందూ వాహిని, విశ్వ హిందూ పరిషత్, హిందూ కేంద్ర సమితి తదితర అనుబంధ సంఘాల నాయకులు శోభాయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.



## మైనారిటీ కుటుంబాలకు ఆర్థిక సహాయం

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీలకు అందిస్తున్న ఆర్థిక సహాయంలో భాగంగా బుధవారం మేడ్చల్ జిల్లాలో పేద మైనారిటీ కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద మైనారిటీల ఆర్థిక పరిపుష్టి కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు మైనారిటీలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ‘ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన’ కింద మేడ్చల్ జిల్లాలో 232మందిని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటికే ఎంపికైన 225మందిలో ఐదుగురికి రూ.1 కోటి 12లక్షల 50వేల చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి నిరుపేద మహిళకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ‘రేవంత్ అన్న భరోసా’ పథకం కింద జిల్లాలో 25 మంది మైనారిటీలకు వాహనాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా, మైనారిటీ గురుకుల పాఠశాల చైర్మన్ ఫహీం, ఎమ్మెల్సీలు ఇంఫెడి, మీర్జా రహమత్ బేగ్, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీ ఉల్లా, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## బాల్క సుమన్ ను వెంటనే విడుదల చేయాలి

- డాక్టర్ మెతుకు ఆనంద్

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై అక్రమ కేసులు పెట్టి, అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అక్రమంగా అరెస్టు చేసిన బాల్క సుమన్‌ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది పోలీసులు అధికార పార్టీ కార్యకర్తలుగా వ్యవహరిస్తూ బిఆర్‌ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. అక్రమ కేసులు పెడుతున్నారని, ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదన్నారు. పోలీసులు పారదర్శకంగా పనిచేయాలని ఆయన సూచించారు.



## కలెక్టర్ ను కలిసిన చైర్ పర్సన్ అనన్య

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ మున్సిపల్ నూతన చైర్ పర్సన్ అనన్య జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ని కలెక్టరేట్లోని ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలగుచ్ఛం ఇచ్చి వికారాబాద్ పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు. వికారాబాద్ పురపాలక సంఘం అభివృద్ధికి తాను పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
19.02.2026 గురువారం, హైదరాబాద్




పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB)
దేశంలో రెండవ అతిపెద్ద పబ్లిక్ సెక్టర్ బ్యాంక్. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా అమలు చేస్తుంది



## కరీంనగర్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం

- బాధ్యతతో పని చేస్తాం...
- కార్పొరేషన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం...
- వారంలో ఒక రోజు డివిజన్ లో పర్యటిస్తా..
- మేయర్ కొలగాని శ్రీనివాస్

ముద్ర, కరీంనగర్:

బీజేపీపై నమ్మకంతో కరీంనగర్ నగరపాలక సంస్థ బాధ్యతలను అప్పజెప్పిన పట్టణ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కారాలు తెలియజేస్తున్నామని, ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో పనిచేస్తామని, సమస్యల పరిష్కారం కోసం వారంలో ఒక రోజు ఒక డివిజన్ లో పర్యటిస్తానని, మున్సిపల్ కార్పొరేషన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ పట్టణం 66 డివిజన్ లో రూ.13.5 లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు, డ్రైనేజీ పనులను డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ వంగల పవన్ లతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కరీంనగర్ ప్రజలు తమ మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. నగర అభివృద్ధి కోసం కరీంనగర్ పట్టణ ప్రముఖులు, ప్రజల సూచనలు, అభిప్రాయాలను, సలహాలను పరిగణనలోకి తీసుకొని ముందుకు సాగుతామని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసే ఆలోచనతో ఉన్నామని, గతం కంటే మెరుగైన స్థితిలో కరీంనగర్ పట్టణాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకు వెళ్లడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ప్రధానంగా నగరపాలక సంస్థలోని 66 డివిజన్లో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తామని, ప్రజలకు రోడ్లు, డ్రైనేజీల సమస్యలకు విముక్తి కల్పించే లక్ష్యంతో సంకల్పంతో ఉన్నామన్నారు. కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి, పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా, రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏ డివిజన్ కు తాగునీటి కొరత రాకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు వంగల పవన్, గుగ్గిలపు రమేష్, సోమిడి వేణు ప్రసాద్, బండ రమణా రెడ్డి, కె పీ చంద్ర, శ్రీనివాస్, తాటి ప్రభావతి, కన్న కృష్ణ, బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్, నాయకులు చిట్టి కరుణాకర్ సురేష్, లడ్డు ముందడ, తనకు సాయి కృష్ణ, కైలాస నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాట్లు చేయండి

- మేయర్ కొలగాని శ్రీనివాస్ ను కోరిన బిజెపి మైనార్టీ మోర్చా నేతలు

ముద్ర, కరీంనగర్:

రాబోయే పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కరీంనగర్ పట్టణంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని మేయర్ ను బిజెపి మైనార్టీ మోర్చా నేతలు కోరారు. బుధవారం మేయర్ కొలగాని శ్రీనివాస్ ను బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముజీబ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొహమ్మద్ బషీరుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సమీయుల్లా అహ్మద్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సిద్దిక్ లు కలిసి వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ లోని మస్జిద్ పరిసర ప్రాంతాలు, మైనారిటీ వార్డుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. మసీదుల వద్ద వీధి దీపాలు, పరిశుభ్రత, ఇఫ్తార్ అనంతరం చెత్త తొలగింపు, నీటి సరఫరా, సేహరీ సమయాల్లో హోటళ్లను ఆలస్యంగా నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. తరావీహ నమాజ్ సమయంలో అవసరమైతే తాత్కాలిక రహదారి మూసివేతలు, భద్రతా ఏర్పాట్లు పెంపు, దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజ్ మరమ్మతులు చేయాలని కోరారు. పవిత్ర రంజాన్ మాసం శాంతియుత వాతావరణంలో జరగడానికి మున్సిపల్ యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.




## బాల్యాన్ని చిదిమేస్తే చట్టం ఊరుకోదు

- మానకొండూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం

ముద్ర, కరీంనగర్:

బాలల హక్కులకు భంగం కలిగిస్తే చట్టం ఉక్కుపాదం మోపుతుందని, పిల్లల రక్షణకు చట్టమే ఒక అజేయమైన కవచమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. బుధవారం మానకొండూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ బాల్య వివాహాలనే మహమ్మారి ఆడపిల్లల భవిష్యత్తును అంధకారం చేస్తోందన్నారు. 2006 బాల్య వివాహ నిషేధ చట్టం ద్వారా ఇలాంటి అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. కేవలం వివాహాలే కాకుండా సమాజంలో బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టే 'పోక్సో' చట్టంపై విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా నిర్మూలనతో పాటు నేటి తరాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల ముప్పు నుండి ఎలా బయటపడాలో సోదాహరణంగా వివరించారు. చట్టం అందరికీ సమానమని పేదరికంతో న్యాయానికి దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో న్యాయ సేవా అధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సహాయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని వారు కోరారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, ఏ. కిరణ్ కుమార్, ప్యానల్ అడ్వకేట్లు యస్.వి.ఆర్. కృష్ణ, బలుసుల శాంతి కుమార్, తిరుమణి అశ్విని, జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది కొత్తకొండ శంకర్, న్యాయవాది దుంపేటి శ్రీనివాస్ లు తమ ప్రసంగాలతో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు దాసి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు దీపారాణి, రమేష్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన సమిష్టి బాధ్యత

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ముద్ర, కరీంనగర్:




మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అధికారులతో పాటు ఉపాధ్యాయులు, యువత, తల్లిదండ్రులు సమిష్టిగా మత్తు పదార్థాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు జిల్లాలో సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో డ్రగ్స్ మూలాలను పెకిలించి వేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ మెడికల్ స్టోర్స్ లో అమ్మకాలను పరిశీలించాలని డ్రగ్ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. వైద్యుల చీటీ లేకుండా మత్తు కలిగించే మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలలను సందర్శించి కేవలం డ్రగ్స్ పైనే కాకుండా మద్యపానం, ధూమపానం అనర్థాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. జిల్లాలో అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పోలీస్, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, అమ్మకం తదితర అంశాల్లో జనవరి 2025 నుండి జిల్లాలో ఇప్పటి వరకు 37 కేసులు నమోదు చేశామని అన్నారు. 87 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. జిల్లాలో 42 కిలోల 225 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. డాగ్ స్క్వాడ్ ద్వారా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికే డ్రగ్స్ డిడక్షన్ కిట్ల ద్వారా తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ వినియోగంపై ఉక్కు పాదం మోపుతామని అన్నారు. డ్రగ్స్ అమ్మకాలు, వినియోగం, రవాణా వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చెక్ డ్యాంల వద్ద ఇసుక తోడడం నిషేధం

ముద్ర, కరీంనగర్:

చెక్ డ్యాంల వద్ద ఇసుక తోడడం నిషేధమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నదులపై చెక్ డ్యాంలు నిర్మించినచోట భద్రత దృష్ట్యా డ్యాంకు ఎగువన, దిగువన 300 మీటర్ల వరకు ఇసుక తోడడం నిషేధమని, అధికారులు ఎప్పటికప్పుడు ఈ అంశాన్ని పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా పరిధిలోని నదీ ప్రవాహాలకు సంబంధించి సరిహద్దులను పక్కాగా గుర్తించాలని, రికార్డు చేయాలని సూచించారు. ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్.డబ్ల్యూ.ఎస్, టిజిఎండిసి, పోలీస్ అధికారులు సమన్వయంతో ఇసుక రీచ్ లను తనిఖీ చేయాలన్నారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ పోర్టల్ లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక కేటాయింపు పై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రౌండ్ వాటర్ డిడి శ్యాంప్రసాద్ నాయక్, డిపిఓ జగదీశ్వర్, జిల్లా జియాలజిస్ట్ ప్రసన్న, డిఈఈ రాజేందర్, డిప్యూటీ డిఈ వేణుగోపాల్, మైండ్స్ ఏడి రాఘవరెడ్డి, టీజీఎండిసి పిడి శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ రవి, ఆర్ఓ కనుక జ్యోతి పాల్గొన్నారు.

# ప్రభుత్వ హామీలు నెరవేర్చే వరకు పోరాటం

- జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలలో సత్త చాటుతాం
- కరీంనగర్ జిల్లాలో జాగృతి బలోపేతానికి గ్రామ స్థాయి నుండి చర్యలు
- జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్

ముద్ర, కరీంనగర్:



హామీలు నెరవేర్చే వరకు పోరాటం రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామని జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్ అన్నారు. కరీంనగర్ లోని జాగృతి కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లఖావత్ రూప్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రూప్ సింగ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో మూడు పార్టీలు ఏకమై పనిచేశాయని, బయటకు వారు వేరు వేరు రాజకీయ పార్టీలు అయినప్పటికీ అధికారం పంచుకోవడంలో మూడు పార్టీలు ఒకే విధానంలో పని చేస్తున్నాయని అన్నారు. మున్సిపల్ ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా జాగృతి అభ్యర్థులు మంచి ఫలితాలను సాధించారని, వచ్చే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలలో కూడ జాగృతి తన అభ్యర్థులు పోటీలో నిలుపుతుందని అన్నారు. జాగృతిని గ్రామ స్థాయి వరకు తీసుకుపోయే బాధ్యతలను ప్రతి నాయకుడు భుజాన వేసుకొని ముందుకు పోవాలని అన్నారు. అనంతరం జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో జాగృతి బలోపేతం కోసం జిల్లాలో అన్ని స్థాయిలలో కమిటీలను నిర్మిస్తామని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు జాగృతి ప్రజలను కలుపుకొని ప్రజా ఉద్యమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, అధివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా ముఖ్య నాయకులు రంగరవేణి లక్ష్మణ్, చండి శ్రీనివాస్, గాలిపెల్లి రత్నాకర్ చారి, సాయికృష్ణ, బుర్ర నాటరాజ్, కోరపల్లి నరేష్, కొత్తురి రఘు, సంగీత రెడ్డి, బండ అశోక్, సంతోష్ యాదవ్, రొంటాల రాజ్ కుమార్, జైపాల్ రెడ్డి, రోజా రెడ్డి, బశెట్టి కృష్ణవేణి, గర్శకుర్తి విద్యాసాగర్, పుసాల పవన్, మెంగని పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి

- మార్చి 31 వరకు నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలి
- కరీంనగర్ జిల్లాలో వేగంగా ఇండ్ల నిర్మాణం.. ప్రోగ్రెస్ చాలా బాగుంది..
- రాష్ట్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్

ముద్ర, కరీంనగర్:



ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మొదటి దశలో ప్రారంభించిన పనులన్నింటినీ మార్చి 31 లోగా పూర్తిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులు సంబురంగా గృహప్రవేశాలు జరుపుకు నేలా ఇండ్లను సిద్ధం చేయాలని సూచించారు. బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూరు కోతిరాంపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల ప్రగతిని క్షేత్రస్థాయిలో ఎండి గౌతం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో కలిసి పర్యవేక్షించారు. ఇండ్ల నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. లబ్ధిదారులతో ఎండి స్వయంగా మాట్లాడారు. ఇంటి నిర్మాణ పనుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎండి గౌతమ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ పెండింగ్లో పెట్టవద్దని పనులు మరింత వేగవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొదటి దశలో ప్రారంభించిన ఇండ్ల తుది పనులు మార్చి 31పూర్తి కావాల్సిందేనని పేర్కొన్నారు. ఇసుక ఇటుక సిమెంటు కొంత చౌక ధరల్లో లభించేలా అధికారులు డీలర్లు నిర్వాహకులతో మాట్లాడాలని ఆదేశించారు. కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రోగ్రెస్ చాలా బాగుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో పాటు అధికారులను అభినందించారు. అనంతరం కరీంనగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో ఎండి గౌతమ్ సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. ఆయా కార్యక్రమాల్లో హౌసింగ్ పీడీ శ్రీనివాస్ ఆర్ అండ్ బి ఈఈ నరసింహ చారి తిమ్మాపూర్ తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డితో పాటు హౌసింగ్ అధికారులు పలువురు అధికారులు పాల్గొన్నారు.



## సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం సేవాలాల్ జయంతి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన ఖానాపూర్ పట్టణంలో నిర్వహించనున్న జయంతి వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. జయంతి వేడుకలకు భారీ సంఖ్యలో హాజరయ్యే వారికి తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. వేడుకల ప్రదేశంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే ప్రజల రాకపోకలకు అవసరమైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు, వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు భోజన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించే ర్యాలీకి కూడా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డిఓ రత్న కళ్యాణి, వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, తహసిల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, గిరిజనాభివృద్ధి శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 50వ డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిది

- కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు...

ముద్ర, కరీంనగర్:

కరీంనగర్ పట్టణం 50వ డివిజన్ ప్రజలు తనపై విశ్వాసం, నమ్మకంతో మున్సిపల్ ఎన్నికల్లో అందించిన విజయం జీవితంలో మర్చిపోలేనిదని, డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, డివిజన్ సమగ్రాభివృద్ధి కోసం కృషిచేసి ప్రజల రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తానని కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. ఎన్నికల్లో విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ బుధవారం ఆయన 50వ డివిజన్ లో పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్లోని పలు ప్రాంతాల్లో ప్రముఖులు బోయినపల్లి ప్రవీణ్ రావును అభినం దించి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రావు మాట్లాడుతూ డివిజన్ ప్రజలు తనపై చూపిన ప్రేమ, అభిమానం స్పష్టంగా కనిపించిందని, ప్రజలు ఆశీర్వదిస్తేనే కార్పొరేటర్ గా విజయం సాధించానని తెలిపారు. డివిజన్ ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా డివిజన్ సమగ్రాభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.

## ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ ఎన్నికకు మార్గం సుగమం

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక లో ప్రతిష్టంభన తొలగిపోయింది. బిఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నాలుగేసి స్థానాలు గెలుచు కోవడంతో ఈ సమస్య తలెత్తింది. బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఈ సమస్యకు ముగింపు పలికారు. మున్సిపాలిటీ పీఠం కోసం ఇరు పార్టీలు కలిసి పని చేయాలని నిర్ణయించాయి. రెండు పార్టీలు బుధవారం వేర్వేరుగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. చైర్మన్ పదవిని బీజేపీకి ఇచ్చి వైస్ చైర్మన్, నాలుగు కో ఆప్షన్ పదవులు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. లేని పక్షంలో చైర్మన్ పదవిని బీఆర్ఎస్ కు, వైస్ చైర్మన్ తో పాటు నాలుగు కో ఆప్షన్ పదవులు బీజేపీకి ఇవ్వాలని కోరారు. పట్టణం అభివృద్ధికి జేపీసీ నేతృత్వంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పని చేద్దామని నాయకులు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ను తిరస్కరించారని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ సహకారంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, మున్సిపల్ లలో ఉపాధి హామీ పథకం తిరిగి ప్రారంభం చేయిస్తామని అన్నారు. పట్టణ ప్రజల ఆకాంక్ష మేరకు కలిసి అభివృద్ధికి కృషి చేద్దామని అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
19.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



బ్యాంక్ ఆఫ్ బరోడా (Bank of Baroda)
అంతర్జాతీయంగా విస్తరించిన భారతీయ బ్యాంకుల్లో ఇది ఒకటి. విదేశాల్లో కూడా సేవలు అందిస్తోంది.





## మౌలిక వసతులు కల్పించాలి

- భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమవుతున్నందున జిల్లాలోని మసీదులు, వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మినీ మీటింగ్ హాలులో రంజాన్ మాసం పురస్కరించుకొని జరిగిన శాంతి సంఘ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టరు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో కరెంట్, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మసీదుల వద్ద పటిష్టమైన పారిశుద్య పనులు చేపట్టాలని, మంచినీరు సౌకర్యం కల్పించాలని, వీధి దీపాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ ప్రసారం ఉండేలా చూడాలని ఆదేశించారు. సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకునే రంజాన్ మాసం అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. మతసామరస్యానికి ప్రతీక గా జిల్లాను నిలపాలన్నారు. అడిషనల్ ఎస్పీ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో, మసీదుల వద్ద అన్ని ఏర్పాటు లు చేస్తామని, రంజాన్ మాసంలో పూర్తి బందోబస్తు ఉంటుందని, సెక్యూరిటీని ఏర్పాట్లు చేస్తామని, అందరి సహకారంతో సామరస్య వాతావరణంలో రంజాన్ మాసం నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ,భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి , పోలీస్ అధికారులు,మత పెద్దలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# యాదాద్రికి ఆధ్యాత్మిక శోభ

- స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- మిరుమిట్లు గొలుపుతున్న విద్యుద్దీపాలు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

తెలంగాణ తిరుపతి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, నిర్వహించారు సాయంత్రం 6:30 కు మృత్స్యం గ్రహణం అంకరారోపణం నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా పూజలు నిర్వహించిన కలశములోని జలముతో ప్రధానాలయ, మాడవీధులలో, ఆలయం చుట్టూ కూడా అర్చకులు సంప్రోక్షణ చేశారు. బ్రహ్మోత్సవాలకు దాదాపు 100 మంది రిత్వికులను ఆహ్వానించారు. ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ప్రతిరోజు 1500 మందికి భోజన వసతి, అవసరమైతే భక్తుల సంఖ్యను బట్టి ఇంకో 1000 మందికి కూడా ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో నిర్వహింపబడు ప్రత్యేకమైన సేవలలో పాల్గొనాలి అనుకునే భక్తులు రూ.20 వేలు (దంపతులకు మాత్రమే) చెల్లించి సేవలలో పాల్గొనవచ్చు అని తెలిపారు. వారికి అంతరాలయ దర్శనం స్వామి వారి కళ్యాణం కనుమ, అభిషేకం లడ్డు ప్రసాదంగా ఇవ్వబడుతుందని ఆలయ ఈవో భవాని శంకర్ తెలిపారు. సుమారు రూ.2 కోట్ల బడ్జెట్ తో స్వామివారి బ్రహ్మోత్సవాలను న భూతో న భవిష్యతి అన్నట్లు అంగరంగ వైభవంగా నిర్వహింపబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహ మూర్తి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, స్థానాచార్యులు కాందూరి వెంకటాచార్యులు, ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, డీఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఏఈఓ గజవెల్లి రఘు, సూపరింటెంట్ సీతారామ చారి, ఉప ప్రధానార్చకులు మంగళగిరి నరసింహమూర్తి, మాధవాచార్యులు, లక్ష్మణాచార్యులు, ముఖ్య అర్చకులు వెంకటాచార్యులు, కిరణ్ కుమారాచార్యులు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



## అర్చక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

ధూప దీప నైవేద్య అర్చక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సర్వసభ్య సమావేశం భువనగిరి పట్టణంలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికీర్తి అమరేశ్వర శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని ధూప దీప నైవేద్య అర్చకులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుల పదవికి ఓట్లు నిర్వహించగా జోషి పవన్ కుమార్ శర్మ అధ్యక్షులుగా విజయం సాధించారు. అనంతరం అర్చకులు ఉపాధ్యక్షులుగా కొల్లావర్ఘుల శ్రీనివాస్ శర్మ, శంకు భద్రప్ప, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల అమలేశ్వర్, కార్యదర్శిగా వల్లంబట్ల శ్రీనివాస శర్మ, కోశాధికారిగా మూటకొండూరు కార్తీక్ శర్మ, సహాయ కార్యదర్శిగా పసునూరి నిత్యానందం, ప్రచార కార్యదర్శిగా మంచోజు చంద్రశేఖర చార్యులు, కార్యవర్గ సభ్యులుగా మోత్కూరు ప్రదీప్ శర్మ, నేరెళ్లపల్లి హరిబాబు శర్మ, కొల్హాపూర్ మహేందర్ శర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు నారాయణ మణికంఠ శర్మ, పవన్ శర్మ, చలివేదుల రాజేశ్వర శర్మ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు.

స్కూల్ లో మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత ఉంది, అందులో 10 వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. అన్ని సబ్జెక్ట్స్ సిలబస్ లు పూర్తి చేశారా . రోజు సాయంత్రం స్పెషల్ క్లాసులు జరుగుతున్నాయ. ఉదయాన్నే 5 గంటలకు పిల్లకి వేక్ అప్ కాల్ చేస్తున్నారా అని అడిగారు. అనంతరం 10 వ తరగతి విద్యార్థులకి గణితంలో ప్రశ్నలు వేసి అడిగారు. బోర్డు పై వాటికి సమాధానాలు చెప్పారు. పరీక్షల సమయం దగ్గర పడుతుంది ఇప్పటి నుండి సిద్ధం అవ్వాలి అని చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులు సంఖ్య పెంచాలి అని ఉపాధ్యాయులకి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి బోధన అందుతుంది ఇప్పటి నుండే గ్రామంలో ప్రజలకి ప్రభుత్వ పాఠశాలల విద్యా బోధన పై అవగాహన కల్పించాలి గ్రామంలో ఉండే ప్రతి విద్యార్థి మన ప్రభుత్వ బడిలో చదువుకునేల చూడాలి అని అన్నారు.



## మున్సిపల్ కౌన్సిలర్లకు సన్మానం

**ముద్ర, మోత్కూరు:**

మోత్కూరు మున్సిపల్ పరిధిలో ఇటీవల గెలిచిన గౌడ సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్లు గనగాని శైలజ, నర్సయ్య గౌడ్, బీసు శ్రీకాంత్ గౌడ్, కారుపోతుల వెంకన్న గౌడ్ లను కంఠమహేశ్వర స్వామి కమిటీ ఆధ్వర్యంలో కంఠమహేశ్వర స్వామి ఆలయం వద్ద పూలమాలలు, శాలువాలతో ఆత్మీయ సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బత్తిని శ్రీనివాస్, బుర్ర కృష్ణ, లోడే యాదయ్య సూధగాని యాదగిరి గౌడ్,చాపల అంజయ్య, బైరగోని ఉపేందర్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, గనగాని చంద్రయ్య బుర్ర లచ్చయ్య, బుర్ర శ్యాం ప్రసాద్, బుర్ర యాదయ్య, లోడే రాజు, బుర్ర నర్సయ్య, బోయిని లచ్చయ్య, బుర్ర రాములు తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు చెక్కుల పంపిణీ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

గంధ మల్ల రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కింద చెక్కులను పంపిణీ చేశామని రాష్ట్ర ప్రభుత్వం విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరం జిల్లా కలెక్టర్ హనుమంత రావు, అదనపు కలెక్టర్ భాస్కరరావు తో కలసి 412 మంది రైతులకు ఎకరానికి 24 లక్షల 50 వేల చొప్పున 87 ఎకరాలకు 22 కోట్ల 80 లక్షల 58 వేలు గంధ మల్ల బండ్ పోర్షన్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. గంధ మల్ల రిజర్వాయర్ కోసం రైతులు భూములు ఇవ్వడం వలన ఎనిమిది మండలాలలో 50 వేల ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులు బాధపడకుండా ఉండేందుకు రిజర్వాయర్ కట్టిన తర్వాత ఉపాధి కోసం, వారి కుటుంబాలకు మాత్రమే ఇవ్వడం జరుగుతుందని అన్నారు. భూ సేకరణ విషయంలో రైతుకు ఇంత పెద్ద మొత్తాన్ని ఇప్పించిన ఘనత కలెక్టర్, అదనపు కలెక్టర్ దే అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఇరిగేషన్ యస్ ఈ రవీందర్, ఈ ఈ రఘునాథ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, తుర్కపల్లి ఎమ్మార్వో జలకుమారి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే కుంభం చిత్రపటానికి పాలాభిషేకం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి 22వ వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో స్థానిక వినాయక చౌరస్తా వద్ద బుధవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యువ నాయకురాలు కీర్తి రెడ్డి పట్టణంలో మునిసిపల్ ఎన్నికల సందర్భంగా జనరల్ మహిళా చైర్మన్ స్థానంలో, జనరల్ వైస్ చైర్మన్ స్థానంలో ఇద్దరు బిసిలకు ముఖ్యంగా అత్యంత వెనుకబడిన కులం విశ్వ బ్రాహ్మణ కులానికి చైర్మన్, మరో బిసి కి వైస్ చైర్మన్ (ఇద్దరు మహిళలు) అలాగే జనరల్ స్థానంలో ఎస్సీలకు టికెట్ ఇచ్చి అన్ని రకాల సహాయ సహకారాలు చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సల్వా కిశోర్, బట్టు మహేందర్, బుషపాక మనీష్, బుషపాక రాకేష్, కోళ్ల ప్రవీణ్, కొండమడుగు రాజు, ప్రమోద్, మని, సాదిక్, వరుణ్, శివ గణేష్, నరేష్, నాగేంద్ర బాబు, విజయ్, పాడిగేలా రాజు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయిలో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

- యాదాద్రి జిల్లాకు 14 పతకాలు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

హైదరాబాద్ లోని రాష్ట్ర వ్యాయామ విద్య కళాశాలలో మంగళవారం నిర్వహించిన దివ్యాంగ చిన్నారుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా విద్యార్థులు వివిధ కేటగిరీలలో బాలురు బాలికలు కలిపి (అండర్ 14, అండర్ 17 విభాగాల్లో) 14 పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో దివ్యాంగ విద్యార్థులకు జరిగిన మొట్టమొదటి క్రీడా పోటీల ప్రారంభంలో జరిగిన మార్చ్ ఫాస్ట్ లో యాదాద్రి భువనగిరి జిల్లా విద్యార్థులు ప్రత్యేక ప్రతిభ చూపించి, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు డా.నవీన్ నికోలస్ ద్వారా ద్వితీయ బహుమతి అందుకున్నారు. హాజరైన 25మంది విద్యార్థుల్లో ప్రతీ ఒక్కరూ అద్వితీయమైన ప్రతిభ కనబరిచి 14 రాష్ట్రస్థాయి బహుమతులు సాధించారు. పథకాలు సాధించిన వారు విద్యా శాఖ సహాయ సంచాలకులు వెంకట నరసమ్మ ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి కందుల సత్యనారాయణ, జిల్లా సమగ్ర విద్య కోఆర్డినేటర్ (కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి) పెసరు లింగారెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.




## విశ్వకర్మపై అవగాహన సదస్సు

**ముద్ర, మోత్కూర్:**

ర్యాంపు ప్రాజెక్ట్ లో భాగంగా మండలంలోనీ మహిళ సమాఖ్య కార్యాలయంలో జిల్లా ఈడీసీ మేనేజర్ కుమ్మరికుంట్ల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 35 మందికి సంప్రదాయ వృత్తిదారులు, శిల్పులు, సూక్ష్మ, చిన్న మధ్య తరహా వ్యాపారవేత్తలకు పథకం ప్రయోజనాలు, రుణ సదుపాయాలు, శిక్షణ, టూల్ కిట్ సహాయం వ్యాపార అభివృద్ధి అవకాశాలపై ట్రైనర్ అశోక్ క్లుప్తంగా వివరించారు. బ్యాంకులు వాటి పరిమితులు విధి విధానాలు ఎ రకంగా లోన్లు మంజూరు చేస్తాయి వాటి షరతులు తదితర అంశాలను ఎస్బిఐ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈడీసీ అసిస్టెంట్ మేనేజరు మహేష్, లక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో మర్యాల విద్యార్థుల ప్రతిభ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

బొమ్మలరామారం మండలం మర్యాల జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ఛాంపియన్లుగా నిలుస్తున్నారు. ఎస్ జి ఎఫ్ క్రీడల్లో జాతీయ స్థాయి కి ఎంపికై తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల జరిగిన సిం కేపప్ క్రీడల లో ఉమ్మడి నల్గొండ జిల్లా లోనే మర్యాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికై అబ్బురపరిచారు. జిల్లాలో మారుమూల గ్రామమైన మర్యాల విద్యార్థులు అన్ని విభాగాల క్రీడల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవ్వడంతో పలువురు ప్రశంసిస్తున్నారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుతున్న పిడి కోనేటి గోపాల్ ను అభినందిస్తున్నారు. బాలికల ఖో ఖో విభాగంలో వేదశ్రీ, శ్రావణి, ప్రవళిక, జస్మిత, రవళి, హరిష్మా, శ్రేష్ఠ, చరణ్య, హారిక, అథ్లెటిక్స్ లో హరిష్మా,నిహారిక, అక్షయ, బాలుర ఖో ఖో విభాగంలో నరేష్, గోవింద్ సింగ్, తిరుపతి, సన్నీ, భవేష్, చరణ్, మణికంఠ, విష్ణువర్ధన్, అరుణ్ అథ్లెటిక్స్ లో దేవేందర్ లు ఎంపికయ్యారు. తమ ప్రతిభ కనపరచడం పట్ల సర్పంచ్ సంగి గణేష్ తో పాటు పలువురు అభినందించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
19.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**కెనరా బ్యాంక్ (Canara Bank)**

పాత పబ్లిక్ సెక్టర్ బ్యాంక్‌గా విశ్వసనీయతను సంపాదించింది. MSME, వ్యవసాయ రుణాల్లో కీలక పాత్ర పోషిస్తుంది.






## ఎస్ఐఆర్ అమలులో పురోగతి సాధించాలి

• **కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అమలులో పురోగతి సాధించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓల సూపర్వైజర్లతో ప్రి ఎస్ఐఆర్ పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రం వారీగా పరిశీలించారు. పనితీరులో వెనుకబడి ఉన్న ఆయా ఏఈఆర్ఓ లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 51.96 శాతం మాత్రమే ఓటర్ మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. ప్రత్యేకంగా అర్బన్ సెగ్మెంట్‌లో పురోగతి తక్కువగా ఉందన్నారు. ఇందుకోసం డోర్ టు డోర్ సందర్శనల ద్వారా ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేసి, పది రోజుల్లో కనీసం 85 శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తక్కువ పురోగతి ఉన్న బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో చర్చించి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఏఈఆర్ఓలు వారం పాటు ప్రతి రోజూ మూడు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించి, రోజువారీ సమీక్ష చేయాలని స్పష్టం చేశారు. పనితీరు సంతృప్తికరంగా లేని బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్తగా విలీనమైన ప్రాంతాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్‌కు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.





# ప్రత్యేక తరగతులతో ఉత్తమ ఫలితాలు

• **కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ప్రత్యేక తరగతుల ద్వారా పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు వస్తాయని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని కౌడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల కోసం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాలను పరిశీలించారు. తరగతి గదుల్లో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు సబ్జెక్టుల వారీగా ప్రశ్నల రూపంలో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల జవాబుల పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే విషయంలో నిబంధనలు పాటించాలని ఆదేశించారు. రుచి,శుచితో కూడిన ఆహార పదార్థాలు అందించాలన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఉత్తమ స్థానంలో ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టుల వారీగా సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని పేర్కొన్నారు. సర్కారు పాఠశాలల్లో గుణాత్మక విద్య లక్ష్యంగా ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులు చదువుకునేలా పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలించాలి

• **అదనపు కలెక్టర్ నగేష్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో బాల్య వివాహం భారత్ 1 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవితో కలిసి ప్రత్యేక ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనంలోని మైక్ సదుపాయంతో గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి మాట్లాడుతూ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రామసభలు, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన తండాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ ఓ రామచంద్ర రాజు, జిల్లా బాలల సంరక్షణ అధికారి నాగరాజు, మహిళా శక్తి కేంద్ర కోఆర్డినేటర్ సంతోషి, కైలాష్, రాజు, శరత్ తదితరులు పాల్గొన్నారు.






## క్షేత్ర స్థాయి సందర్శన అత్యంత కీలకం

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి ఫిబ్రవరి 18:**

శిక్షణలో క్షేత్ర స్థాయి సందర్శన అత్యంత కీలకమని కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా జిల్లాలోని బడంపేట, సజ్జాపూర్, అనంతసాగర్, మల్లేపల్లి, గొంగళూరు, బస్వాపూర్, అరూర్, వెల్టూర్, అల్గోల్, మల్ చల్మా గ్రామాలను ఆరు శాఖలకు చెందిన 60 మంది గ్రూప్‌వన్ అధికారులు సందర్శించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పలు శాఖల పనితీరు, పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్వాడీ కేంద్రాలు, అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, ఎన్ఆర్ఈజీఎస్ పనులను అధికారులు పరిశీలించారు. గ్రామ ప్రజలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. శిక్షణ అధికారులు బుధవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడుతూ గ్రామ, జిల్లా అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. పరిపాలనలో పారదర్శకత, సమర్థత, ముఖ్యమని వివరించారు. ఈ సందర్భంగా పలువురు గ్రూప్‌వన్ అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ఇందిరా మహిళ కార్యక్రమం సమర్థవంతంగా అమలవుతోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు రుణాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు ప్రత్యక్షంగా గమనించామని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయన్నారు.ఈ పర్యటన తమకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గురువులను సత్కరించిన శిష్యులు

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

తమకు పాఠాలు బోధించిన లెక్చరర్లను పూర్వ విద్యార్థులు వినూత్నంగా సత్కరించారు. సాధారణంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాల్లో గురువులను సత్కరించడం మామూలే. అందుకు భిన్నంగా 51 సంవత్సరాల క్రితం డిగ్రీలో తమకు పాఠాలు బోధించిన మాజీ ఎమ్మెల్సీ, ఐఐటీ రామయ్య (Maths), మధుసూదన్ (Physics), నాగేశ్వరరావు (Chemistry)లను హైదరాబాద్ లోని వారి ఇళ్ల వద్దకే వెళ్లి మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో 1975లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీ విద్యనభ్యసించిన తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డు ప్రొఫెసర్లు డా.నాగభూషణం, కిష్టయ్య, రిటైర్డు లెక్చరర్ సంపత్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ కొమురవెల్లి అంజయ్య, వివిధ రంగాలకు చెందిన బి.మల్లేశం, నర్సింహారెడ్డి, కే.లక్ష్మీనారాయణ, చింత సత్యనారాయణ, గాల్ రెడ్డి, రామచంద్రమూర్తి, ఎస్ ఎన్ చారి, పి. లక్ష్మీనారాయణ, గౌరయ్య, జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెట్టును ఢీకొట్టిన కారు

• **బీసీవై జిల్లా అధ్యక్షుడి మృతి**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**





కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడిన ఘటన జిల్లాలోని కొల్చారం సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగింది. ఈ ప్రమాదంలో బీసీవై జిల్లా అధ్యక్షుడు రోహిత్ గుప్తా మృతి చెందారు. తెల్లవారుజామున గాఢ నిద్ర, అతి వేగంతో చెట్టును ఢీకొట్టడంతో పల్టీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన భారత యువజన చైతన్య (బీసీవై) జిల్లా అధ్యక్షుడు, వీవీ సిల్క్స్ బట్టల షాపు యజమాని వనపర్తి రోహిత్ గుప్తా (47), కామారెడ్డి జిల్లా కు చెందిన మరో నాయకుడు విజయ్ కుమార్ విజయవాడకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగొస్తుండగా కొల్చారం సమీపంలో జరిగిన ప్రమాదంలో రోహిత్ గుప్తా అక్కడికక్కడే మృతి చెందాడు. విజయ్ కుమార్ కు తీవ్ర గాయాలయ్యాయి. రోహిత్ గుప్తా భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కుల్చారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

**మెదక్ లో విషాదం..**

రోహిత్ మరణ వార్త మెదక్ పట్టణంలో విషాదం అలుముకుంది. రోహిత్ వ్యాపారీగా అందరితో కలివిడిగా ఉండేవాడు. పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడికి భార్య, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం అశ్రు నాయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ రావు, పద్మ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రాధికా భూపతిరాజ్, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, కౌన్సిలర్లు శివ రామకృష్ణ, బట్టి ఉదయ్ కుమార్, ఆంజనేయులు, మన్సూర్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, ఆర్కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపవాస దీక్షలతో సామరస్యం పెంపొందాలి

• **ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి :**



. రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, ఆనందం పెంపొందాలని స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని పేర్కొన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలతో నిష్టగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారని తెలిపారు. అల్లా రక్షణ, కరుణ పొందాలనే లక్ష్యంతో రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో ఎంతోకొంత దానధర్మాలు చేస్తారన్నారు. సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం ఎంత సంతోషంగా ఉంటుందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# పీఆర్సీపై తక్షణమే ప్రకటన చేయాలి

• **ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజేందర్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

నూతన పీఆర్సీపై ముఖ్యమంత్రి తక్షణమే ప్రకటన చేయాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎస్టీయూ భవన్ లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గజేందర్ మాట్లాడారు. ప్రభుత్వం పీఆర్సీ నివేదికను తెప్పించుకొని అమలు చేయాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. నూతన ఈహెచ్ఎస్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలన్నారు. రెగ్యులర్ ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులివ్వాలని డిమాండ్ చేశారు. జీవో 190 ప్రకారం ఇంటర్ లోకల్ డిప్యూటేషన్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పాఠశాల విద్యాశాఖ హేతుబద్ధీకరణ పేరుతో ఖాళీ పోస్టులను రద్దు చేసే ఆలోచన మానుకోవాలని సూచించారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ లో ప్రభుత్వం కేటాయింపులు పెంచాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. దానికి అవసరమైన విద్యా హక్కు చట్టం సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, రాష్ట్ర బాధ్యులు నర్సింలు, రాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి కిష్టయ్య, భూపతిగౌడ్, అశోక్, నాగరాజు, శ్రీనివాస్, బాలకృష్ణ, వేణు గోపాల్, శివప్రసాద్, ఎల్లం, అరుణ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
19.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



యాక్సిస్ బ్యాంక్ (Axis Bank)
యాక్సిస్ బ్యాంక్ (Axis Bank)
ప్రైవేట్ రంగంలో వేగంగా ఎదుగుతున్న బ్యాంక్. టెక్నాలజీ ఆధారిత సేవలు దీని ప్రత్యేకత.
AXIS BANK




## మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- **మంత్రి అజారుద్దీన్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తమ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ముహమ్మద్ అజారుద్దీన్ వెల్లడించారు. మైనారిటీల సంక్షేమానికి రూ.3,500 కోట్ల బడ్జెట్ కేటాయించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. బుధవారం నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్‌లో రాష్ట్ర మైనార్టీల ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న పలు పథకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సహాయ పథకాల ప్రారంభం, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, శిక్షణ- ప్లేస్‌మెంట్ కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీల్లో పేదరిక నిర్మూలన లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద 5 వేల మంది అర్హులైన మహిళలకు ఆర్థిక సాయం చేశామన్నారు. ఈ పథకానికి రూ.25 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఈస్కూటర్ పథకం కింద 3,150 మందికి ప్రయోజనం కలిగిందని చెప్పారు. ఈ పథకానికి మొత్తం రూ.37.80 కోట్లు కేటాయించామన్నారు. 2వేల మందికి జనరేటర్లు , టూల్‌కిట్లు వంద శాతం సబ్సిడీ పై ఇచ్చామన్నారు. శిక్షణ - ప్లేస్‌మెంట్ కార్యక్రమం కింద రూ.9.76 కోట్లతో 55 ఎంపానెల్డ్ శిక్షణ సంస్థల ద్వారా 4,800 మంది మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మోపెడ్లు, ఈబైక్‌లకు మంత్రి హరిత జెండా ఊపి అందచేశారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కింద మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు. కొత్తగా ప్రవేశపెట్టిన పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు. దరఖాస్తులను ఈ నెల 19 నుంచి 28 వరకు అధికారిక వెబ్‌సైట్ http://tsobmms.cgg.gov.in ద్వారా స్వీకరించబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబైదుల్లా కోత్వాల్, ఎమ్మెల్సీలు మిర్జా రహ్మత్ బేగ్, రియాజుల్ హసన్, పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీయుల్లా, మాజీ ఎమ్మెల్సీ ఆమీర్ అలీ ఖాన్, అఫ్జల్ బియాబాని, ఖుస్రో పాషా, హజ్ కమిటీ ఛైర్మన్ అజ్మతుల్లా హుస్సైనీ, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఫహీమ్ ఖురేషీ పాల్గొన్నారు.

## లక్ష్మిగూడ @ రూ.51 వేలు

- **హౌసింగ్ బోర్డు ఒపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన**
- **హాట్ కేకుల్లా అమ్ముడైన 14 ప్లాట్లు**
- **రూ.14.75 కోట్ల ఆదాయం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాజేంద్రనగర్ మండలం లక్ష్మిగూడలోని హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన లభించింది. ఇక్కడి 14 ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించడానికి హౌసింగ్ బోర్డు ఈ నెల 2న నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా బుధవారం నిర్వహించిన వేలం పాటలో 49 మంది కొనుగోలుదారులు పాల్గొనగా ప్లాట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. ఈ భూముల చదరపు గజానికి రూ. 32 వేలను అప్ సెట్ ప్రైజ్ గా (కనీస ధరగా) నిర్ధారించారు. కాని వేలం పాటలో గరిష్టంగా చదరపు గజం రూ.51 వేలకు కొనుగోలు చేశారని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 14 ప్లాట్ల విక్రయాల ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల మేర ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జుక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించిన ఈ భూముల విక్రయాల్లో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలకగా, సగటున చదరపు గజం భూమి రూ. 44,285 ధర పలికింది.



**వేలం ముఖ్యాంశాలు..**

- మొత్తం విక్రయించిన ప్లాట్లు 14
- **అప్సెట్ ధర:** చదరపు గజానికి ₹32 వేలు
- **అత్యధిక బిడ్:** చదరపు గజానికి ₹51 వేలు
- **కనిష్ట బిడ్:** చదరపు గజానికి ₹36 వేలు
- **సగటు బిడ్:** చదరపు గజానికి ₹44,285

## భర్తనే అమ్మేసింది..

- **శుభలగ్నం సినిమాను స్ఫూర్తిగా తీసుకుంది**

**ముద్ర న్యూస్:**

దశాబ్దాల క్రితం వచ్చిన శుభలగ్నం సినిమా ట్రెండ్ సెట్టర్ గా నిలిస్తే.. ఆ మూవీని ఇన్స్పిరేషన్ గా తీసుకొని ఓ మహిళ తన భర్తను అమ్మేసింది. ఈ సంఘటన దేశం మొత్తం మీద కలకలం రేపింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలో ఓ 42 సంవత్సరాల వ్యక్తి.. 52 సంవత్సరాల మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తనను, పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆ వ్యక్తి భార్య భోపాల్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. దీంతో న్యాయస్థానం ఆ ముగ్గురికి కౌన్సిలింగ్ ఇచ్చింది. అయితే కౌన్సిలింగ్ ద్వారా కూడా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆ మహిళ తన భర్తను వదులుకోవడానికి సిద్ధపడింది.

ఆ మహిళ తన భర్తను వదులుకోవడానికి ఏకంగా రూ.1.5 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన తీసుకొచ్చింది. దానికి ఆయన స్నేహితురాలు అంగీకరించింది. 1.5 కోట్ల నుంచి 27 లక్షల నగదు, ఇల్లు ఇవ్వాలని తన భార్యను.. ఆ భర్త కోరగా.. ఆమె ఒప్పుకుంది. ఇరవై ఏడు లక్షల నగదు, ఇల్లు తన కూతుర్ల భద్రత కోసం తీసుకున్నట్లు అతడు పేర్కొన్నాడు. ముగ్గురి మధ్య ఈ ప్రతిపాదన రావడం.. దానికి వారు ఒప్పుకోవడంతో కోర్టు కూడా ఆమోద ముద్ర వేసింది. ఓ తెలుగు దర్శకుడు తీసిన శుభలగ్నం ఇక్కడ సూపర్ హిట్ అయితే.. ఆ సినిమాలో కథ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలో నిజంగా జరిగింది. దీనినే కార్యకారక సంబంధం అంటారేమో..

# ధరణి దోపిడీపై ఉక్కుపాదం

- **అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



ధరణి దోపిడీపై ఉక్కుపాదం మోపుతామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఉన్నత స్థాయి కమిటీతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ధరణి అక్రమాలు తీగ లాగితే డొంక కదిలినట్లుగా ఉందన్నారు.

ధరణి పోర్టల్ లో రోజుకో వ్యవహారం బయటకు వస్తోంద న్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించాల్సిన వ్యవస్థనే ఆనాటి ప్రభుత్వంలోని కొంత మంది ప్రముఖులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించగా అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదన్నారు. వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగానే ఉన్నట్లుగా నివేదిక ఇచ్చారన్నారు. అలాగే మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా పోర్టల్ ను రూపొందించారని తెలిపారు. భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభించకుండా లాగిన్‌లు డిలిట్ చేశారని ఆరోపించారు. రహస్యంగా ఉండాల్సిన లాగిన్ వివరాలు లేకుండా పోయినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూలావాదేవీల సమాచారం లభించకుండా చేశారన్నారు.

**కోడ్ ఆడిట్ నిర్వహించాలి..**

ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదన్న విషయం బహిర్గతమైందన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే ధరణి పోర్టల్ పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని గుర్తించామని తెలిపారు. ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎవరు తప్పు చేసిన వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఏ చిన్న లోపానికి తావులేకుండా అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండేలా భూభారతి పోర్టల్ ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజల భూముల విషయంలో ఎటువంటి రాజీ పడబోమన్నారు. ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికితీస్తామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగిలిన జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, సీఎంఆర్వో మందా మకరంద్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డీఐజీ సుభాష్, ఎస్‌బీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, హోంశాఖ సలహాదారు పి. శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- **ఎల్ వన్ కింద 4,800 గృహ నిర్మాణాలకు నిధులు**
- **హైదరాబాద్ జిల్లా ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముద్ర, హైదరాబాద్:**



హైదరాబాద్ లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని జిల్లా ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పారదర్శకంగా వ్యవహరిస్తుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బుధవారం సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, రెండు పడకల గదుల ఇళ్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ వన్ (ఎల్ 1) కింద 4,800 మంది అర్హులైన ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఎల్ టు (L2) కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. హైదరాబాద్ మహా నగరంలో స్థలాలు సేకరించి జీ + 510 వరకు ఇందిరమ్మ ఇళ్లు చేపట్టే ఆలోచన ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న రెండు పడక గదుల ఇళ్ల పనులు పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు సూచించారు. ఖాళీలు, లబ్ధిదారులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు అందించమని చెప్పారు. మిగిలిన పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి, పూర్తయిన ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై ఎమ్మెల్యేలతో కలిసి మంత్రులు సమీక్షించారు. తర్వాత హైదరాబాద్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల ఎమ్మెల్యేల అభిప్రాయాలను స్వీకరించి చేపట్టే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్, కలెక్టర్ హరిచందన దాసరి, హౌసింగ్ పీడీ అశోక్ చక్రవర్తి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మాజీ సీఎంకి మళ్లీ ఛాన్స్

**ముద్ర న్యూస్:**

ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల రాజకీయాలు వేడెక్కుతున్నాయి. జూన్‌లో రాష్ట్రానికి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కొత్త సభ్యుల ఎంపికపై కూటమి పార్టీల్లో చర్చలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుత సంఖ్యాబలం దృష్ట్యా ఈ నాలుగు స్థానాలు కూటమి ఖాతాలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కోటాలో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 2010లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ తో విభేదించి సొంత పార్టీ ఏర్పాటు చేశారు. తరువాత మళ్లీ కాంగ్రెస్‌లో చేరి, తాజాగా బీజేపీలో చేరారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల దృష్ట్యా ఆయనకు రాజ్యసభ సీటు దాదాపు ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

# హంగామా

(మొదటి పేజీ తరువాయి)




**బాల్క సుమన్ కు 14 రోజుల రిమాండ్..**

బాల్క సుమన్‌ను బుధవారం సాయంత్రం మంచిర్యాల మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. మేజిస్ట్రేట్ బాల్క సుమన్ సహా నలుగురికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఏ1గా బాల్క సుమన్ ఉండగా.. ఏ2 మూల రాజిరెడ్డి, ఏ4 దోమ కొండ అనీల్, ఏ8 మామిడి లక్ష్మి కాంత్‌లను సైతం అరెస్టు చేశారు.. గొడిసెల రాజారమేష్, ఏ5 గాజుల చంద్ర కిరణ్, ఏ6 మేడిపల్లి సంపత్, ఏ7 గోగుల రవీందర్ రెడ్డి, ఏ9 బండారి సూరిబాబు తోపాటు మరికొంత మంది పరారిలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అంతకు ముందు బాల్క సుమన్ ఇంట్లోకి భారీగా వచ్చిన పోలీసులు అరెస్ట్ కు సహకరించాలని కోరారు. అందుకు బాల్క సుమన్ అంగీకరించకపోవడంతో బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ వ్యాన్‌లో శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు రాగా.. వారిని బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అక్కడ హైడ్రామా నెలకొంది. పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తలకు తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. తీవ్ర ఆందోళనల మధ్య బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసి మెడికల్ టెస్టుల కోసం ఆస్పత్రికి తరలించారు.

**కాంగ్రెస్ కార్యకర్తలే రాళ్లు విసిరారు : బాల్క సుమన్**

అరెస్ట్‌కు ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. సమాజం తలదించుకునేలా క్యాతనపల్లిలో కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 22 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం ఏడు వార్డులే గెలిచిందని చెప్పారు. కానీ బీఆర్ఎస్, సీపీఐ కలిసి 14 వార్డుల్లో గెలిచామని చెప్పారు. అయినప్పటికీ ఛైర్మన్ పదవి తమకు దక్కకుండా మంత్రి వివేక్ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తలే రాళ్లు విసిరారని.. ఆ దాడిలో తమ పార్టీకి చెందిన మూల రాజిరెడ్డి కారు ధ్వంసమైందని తెలిపారు. పోలీసులు కొట్టి.. కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు వేస్తే.. తమపై కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు

**ఇబ్రహీంపట్నం ఎన్నికపై స్టే ఎత్తివేత ..**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయింది. పీఠంపై విధించిన స్టే ను బుధవారం హైకోర్టు ఎత్తివేసింది. ఎన్నికపై కలెక్టర్ దే తుది నిర్ణయమని స్పష్టం చేసింది. ఈ నెల 17న మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక వేళ తన తండ్రి కనిపించడం లేదని 19వ వార్డు నుంచి గెలుపొందిన కౌన్సిలర్ ఆకుల యాదగిరి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశాడు. దీంతో ఆ ఎన్నికపై హైకోర్టు స్టే విధించింది. విచారణ నిమిత్తం యాదగిరిని బుధవారం కోర్టులో హాజరుపరచాలని కోర్టు ఈ నెల 17న ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు యాదగిరి అదే రోజు కౌన్సిలర్‌గా ప్రమాణ స్వీకారం చేసి ఛైర్మన్ ఎన్నికలోనూ పాల్గొన్నారు. అయితే ఆలోపు ఎన్నిక నిర్వహించవద్దని హైకోర్టు నుంచి ఆదేశాలు రావడంతో ఎన్నిక పూర్తయినా ధ్రువీకరణ పత్రాలు మాత్రం ఎన్నికల అధికారి అందించలేదు.

**నన్ను బలవంతంగా లాక్కెళ్లారు : యాదగిరి**

కోర్టు ఆదేశాల మేరకు యాదగిరి బుధవారం కోర్టు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాదనలు వినిపిస్తూ తనను మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఆయన కుమారుడు బలవంతంగా తీసుకెళ్లినట్లు యాదగిరి కోర్టుకు తెలిపారు. బాపట్ల జిల్లా చీరాల తీసుకువెళ్లారన్నారు. తాను బీఆర్ఎస్ తరపున మున్సిపల్ ఛైర్మన్ రేస్ లో ఉన్నానని, అందువల్ల తనను బౌన్సర్లను పెట్టి మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేశారని కోర్టుకు వివరించాడు. ఇష్టపూర్వకంగానే ఓటింగ్ వేసినట్లు అందరికీ చెప్పాలంటూ తనను ప్రలోభపెట్టారన్నారు. అందువల్ల మళ్లీ ఎన్నికను న్యాయబద్ధంగా నిర్వహించాలని కోర్టును కోరారు.యాదగిరి వాదనపై సానుకూలంగా స్పందించిన ధర్మాసనం ఎన్నికలు పూర్తయ్యే వరకు రక్షణ ఇస్తామని చెప్పింది. అయితే ఇప్పుడు మున్సిపల్ పీఠంపై లైన్ క్లియర్ కావడంతో ఏం జరగబోతోంది అనేది ఉత్కంఠగా మారింది.

**ఖానాపూర్ 'పీఠం' బీఆర్ఎస్ పరం..**

ఖానాపూర్ మున్సిపాలిటీ ఛైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్ కు బీజేపీ ఓపెన్ ఆఫర్ ఇచ్చింది. ఛైర్మన్ పదవి మీరు తీసుకున్నా ఓకే.. మాకు ఇచ్చినా ఓకే అంటూ.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాస్ ఆఫరిచ్చారు. మీకు మేము, మాకు మీరు.. ఇద్దరం కలిసి నడిస్తేనే ఛైర్మన్ ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఛైర్మన్ పదవి మీరు తీసుకుంటే మాకు వైస్ ఛైర్మన్, మాకు ఛైర్మన్ ఇస్తే.. మీరు వైస్ ఛైర్మన్ పదవి తీసుకోండంటూ ప్రెస్ మీట్ పెట్టి మరీ చెప్పడంతో.. ఖానాపూర్ లో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. దేనికైనా సిద్ధంగానే ఉన్నామని, బీఆర్ఎస్ ముందుకు రావడమే ఆలస్యమన్నారు. బీజేపీ ఆఫర్ ను బీఆర్ఎస్ నేతలు అంగీకరించారు. ఛైర్మన్ కాలపరిమితిని చెరిసగం పంచుకుందామని భావించడంతో.. ఖానాపూర్ ఛైర్మన్ ఎన్నిక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు చెక్ పెట్టేందుకే బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందనే చర్చ మొదలైంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
19.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



కోటక్ మహీంద్రా బ్యాంక్ (Kotak Mahindra Bank)
ఫైనాన్షియల్ సర్వీసుల్లో విస్తృత సేవలు అందించే ప్రైవేట్ బ్యాంక్. పెట్టుబడులు, వెల్త్ మేనేజ్‌మెంట్‌లో బలంగా ఉంది.






# 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యంలో లైఫ్ సైన్సెస్ కీలకం

- **బయో ఏషియా-2026 ముగింపు వేడుకలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**ముద్ర డెస్క్ :**

తెలంగాణను ప్రపంచ స్థాయి జీవ విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా నిర్వహించిన 'బయో ఏషియా-2026' ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

**- తెలంగాణ రైజింగ్–2047కు శ్రీకారం..**

దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్-2047' కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి వెల్లడించారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడంలో జీవ విజ్ఞాన రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇందుకోసం తదుపరి తరం జీవ విజ్ఞాన విధానం (2026-2030), జీవ విజ్ఞాన పాఠశాల, జీవ సాంకేతిక పెంపక కేంద్రం, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఔషధ గ్రామాలు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

**- భారీ పెట్టుబడులు- ఉపాధి అవకాశాలు..**

డిసెంబర్ 2023 నుంచి జనవరి 2026 వరకు రూ.73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి లక్ష ఉద్యోగాలు సృష్టించామని మంత్రి వివరించారు. రాష్ట్రంలో 2,000కు పైగా జీవ విజ్ఞాన సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. జాతీయ ఔషధ ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో ఐదో వంతు వాటా తెలంగాణదేనని తెలిపారు. ఈ సదస్సులో సనోఫి, ఒపెల్లా తదితర సంస్థలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయని తెలిపారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరంతో కలిసి జీవ ఆర్థిక వ్యవస్థపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసే దిశగా చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఈసారి ఫార్చ్యూన్ 500 సంస్థల ప్రతినిధులతోపాటు దేశ విదేశాల నుంచి 4,394 మంది పాల్గొనగా, 4 వేలకుపైగా వ్యాపార పరస్పర సమావేశాలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. జీవ విజ్ఞాన రంగాన్ని ప్రభుత్వం కేవలం వ్యాపారంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావిస్తున్నదని తెలిపారు.



# పాకిస్తాన్‌కు గట్టి షాక్ ఇచ్చిన భారత్..!

**ముద్ర డెస్క్ :**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై 2025 ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులను ముష్కరులు కాల్చి చంపారు. దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ, ఆర్మీ, పోలీసులు.. ఉగ్రవాదులు పాకిస్తాన్‌కు చెందిన వారుగా గుర్తించారు. దీంతో ప్రతిగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అంతేకాకుండా దౌత్యపరంగా చాలా అంశాల్లో దాయాది దేశానికి షాక్ ఇచ్చింది. ఇందులో ముఖ్యంగా సింధూ జలాల ఒప్పందాన్ని హోల్డ్‌లో పెట్టింది. తాజాగా రావి నది నీటిని కూడా పాకిస్తాన్‌కు వెళ్లకుండా నిలిపివేయాలని నిర్ణయించింది. షాపూర్ కండి బ్యారేజ్ పనులు మార్చి 31నాటికి పూర్తి కానున్నాయి. దీంతో ఏప్రిల్ నుంచి రావి నది మిగులు నీళ్లు పాకిస్తాన్‌కు వెళ్లకుండా ఆపనున్నట్లు జమ్మూ కాశ్మీర్ మంత్రి జావెద్ అహ్మద్ ప్రకటించారు.

**- సింధూ జల ఒప్పందంలో భాగమే..**

1960 ఒప్పందం ప్రకారం రావి, సట్లెజ్, బీయాస్ నదులు భారత్ నియంత్రణలో ఉన్నాయి. ఇన్నాళ్లూ స్టోరేజ్ సదుపాయాలు లేకపోవడంతో 40-50 శాతం నీళ్లు వృథా పాక్‌కు వెళ్లాయి. ఇప్పుడు ఈ ప్రాజెక్టు నిర్మాణంతో భారత్ తన హక్కులను పూర్తి వాడుకుంటుందని చూపిస్తుంది.

**పాకిస్తాన్ వ్యవసాయంపై ప్రభావం..**

రావి నది నీళ్లు పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రాంతంలో 1.5-2 లక్షల ఎకరాలకు సాగునీటిగా ఉపయోగపడతాయి. వేసవి వేళ ఈ కొరత పశ్చిమ పంజాబ్‌లో ధాన్య, పత్తి పంటలను ప్రభావితం చేస్తుంది. ఇది ఆహార ఉత్పత్తి, ఆర్థికంగా ఒత్తిడి పెంచుతుంది.

**భారతకు ప్రయోజనాలు...**

రావి నదిపై నిర్మించిన ప్రాజెక్టుతో జమ్మూ కశ్మీర్‌లో 32,000 హెక్టార్లు (సాంబా, కతువా), పంజాబ్‌లో 1.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 206 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఏటా 940 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. వృథాగా వెళ్లే 1,000 క్యూసెక్కుల నీటిని సద్వినియోగం చేసుకుంటుంది. ఇదిలా ఉంటే ఈ ప్రాజెక్టు కోసం భారత్ రూ.3,166 కోట్లు ఖర్చు చేసింది. 2018లో నిర్మాణం ప్రారంభమైంది. ఇండస్ ట్రీటీ పాక్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ భారత్ స్వీయ సదుపాయాలు లేకపోవడంతో నష్టపోయింది. షాపూర్ కండి పూర్తయితే భారత్ హక్కులను పూర్తి అమలు చేస్తుంది. పాక్ ప్రతిస్పందనలు, అంతర్జాతీయ చర్చలు రావచ్చు కానీ చట్టపరంగా భారత్ సరైనదే.





# జర్నలిస్టులు సామాజిక బాధ్యతతో పనిచేయాలి

- **మీడియా డైరీ ఆవిష్కరణ సభలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రంగారెడ్డి యూనిట్ పాత్ర ప్రశంసనీయమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే రూపొందించిన రంగారెడ్డి జిల్లా మీడియా డైరీని రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సలీమ్, సత్యనారాయణలతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎండి.సలీమ్ పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

**జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు..**

జర్నలిస్టులకు 5లక్షల ప్రమాద బీమా కల్పించటంతోపాటు, నియోజకవర్గాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించటం గొప్ప విషయమని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్లో మృతిచెందిన జర్నలిస్ట్ రాములు కుటుంబానికి అండగా యూనియన్ నిలబడటం మంచి పరిణామం అన్నారు. జిల్లాలో చనిపోయిన జర్నలిస్టుల జాబితా ఇవ్వాలని వారి కుటుంబాలకు అకాడమీ ద్వారా సహాయం అందిస్తామన్నారు. అదేవిదంగా మృతి చెందిన జర్నలిస్టుల



భార్యలకు 5 సంవత్సరాల వరకు రూ. 3వేల పెన్షన్ తోపాటు, 10వ తరగతిలోపు చదివే పిల్లలకు ప్రతి నెల ఒక వేయి రూపాయలు ఇవ్వటం జరుగుతుందన్నారు. విలేకరులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంటుందని, అది కాపాడుతూ సామాజిక బాధ్యతతో పని చేయాలన్నారు. అదేవిధంగా జర్నలిస్టులు ఆరోగ్యాలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. జిల్లా సమగ్ర సమాచారంతో డైరీని రూపొందించిన రంగారెడ్డి జిల్లా శాఖను శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మీడియా అకాడమీ ద్వారా రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులకు శిక్షణ కుడా ఇవ్వటం జరిగిందన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి..**

రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే ఐజేయూ మాత్రమే అని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో విద్య, వైద్య పరంగా యూనియన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. నూతన డైరీ ఆవిష్కరణ సందర్భంగా జిల్లా జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ షాబాద్లో మృతిచెందిన జర్నలిస్ట్ రాములు కుటుంబానికి 8 లక్షల సహాయం అందించటం జరిగిందన్నారు. జిల్లా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా మాట్లాడుతూ జిల్లా సమగ్ర సమాచారంతో రంగారెడ్డి జిల్లా మీడియా డైరీ 2026ను రూపొందించటం జరిగిందన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ సహకారంతో జిల్లా జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణా తరగతులు విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ సూచనల మేరకు జిల్లా జర్నలిస్టులకు పలు నియోజకవర్గాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మిగతా నియోజకవర్గాల్లో కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిలను శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్, స్టాఫ్ రిపోర్టర్లు జంగయ్య, ఫణింద్ర, జిల్లా ఉపాధ్యక్షులు భీమయ్య, కార్యదర్శులు ఆంజనేయులు, సూర్యనారాయణ, రమేష్, జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి, రాజేంద్ర నగర్ నియోజకవర్గాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్, దామోదర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారి మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు దర్శనం జంగయ్య, ఇలియాజ్, సీనియర్ రిపోర్టర్లు సుభాష్, శేఖర్, తిరుపతి రెడ్డి, శంకర్, రత్నం, యాసీన్, బస్వారాజ్, ఫరీద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఎనర్జీతోనే భవిష్యత్

- **నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ.. అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన**
- **పట్టణాభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం**
- **ముంబై క్లైమేట్ వీక్‌లో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం**

**ముద్ర, ముంబై :**




గ్రీన్ ఎనర్జీ ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో ఆయన మాట్లాడుతూ, తెలంగాణను నెట్ జీరో రాష్ట్రంగా తీర్చిదిద్దడం లక్ష్యమని వెల్లడించారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షలకుపైగా పంపుసెట్లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. బొగ్గు ఆధారిత శక్తి నుంచి సౌర, గ్రీన్ శక్తి వైపు మార్పు తీసుకురావడమే లక్ష్యమని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 25 శాతం గ్రీన్ వనరుల నుంచే వస్తోందని వెల్లడించారు.

**క్యూర్–ప్యూర్–రేర్ జోన్‌లతో అభివృద్ధి..**

రాష్ట్రాన్ని వ్యూహాత్మకంగా మూడు జోన్‌లుగా విభజించినట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిని కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)గా, ఔటర్ రింగ్ రోడ్-రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా తయారీ రంగానికి కేటాయించినట్లు చెప్పారు. తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు.

**గ్రీన్ రవాణాకు ప్రాధాన్యం..**

ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు రద్దు చేసి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. 3,500కుపైగా ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చుతున్నామని, రెండు లక్షలకుపైగా ఆటోరిక్షాలను మార్పు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

**పర్యావరణ పరిరక్షణ చర్యలు..**

మూసీ నది పునరుద్ధరణ, సరస్సుల సంరక్షణ, నీటి వనరుల సమగ్ర నిర్వహణపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక అమలు సంస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి పెంపుతోపాటు పర్యావరణ రక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు.



# రేపటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

**ముద్ర డెస్క్ :**

రంజాన్ నెలవంక భారత్‌లో ఇవాళ కనిపించింది. దీంతో రేపటి (గురువారం) నుంచి పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం నెల పాటు ప్రత్యేక నమాజ్‌లు జరగనున్నాయి.

# రామ మందిరం.. అయోధ్యకు ఆర్థిక పునరుజ్జీవనం

**ముద్ర డెస్క్ :**

అయోధ్యలో రామమందిర నిర్మాణానికి వ్యతిరేకంగా గతంలో లౌకికవాదులు, మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేసేవి. 'గుడికి డబ్బులు వృథా, బడులు-ఆసుపత్రులు కట్టాలి' అని ప్రచారం చేశాయి. కానీ, మోదీ రామ మందిర సమస్యకు పరిష్కారం చూపడంతోపాటు ఆలయం వృథా అన్న నోళ్లతోనే ఇప్పుడు శెభాష అనిపిస్తున్నారు. 2024 జనవరిలో ఆలయం పునఃప్రారంభించిన తర్వాత అయోధ్య ఆర్థిక పరిస్థితి మొత్తం మారిపోయింది. ఐఐఎం లక్నో 'ఎకనామిక్ రెనాసెన్స్ ఆఫ్ అయోధ్య' కేస్ స్టడీ రామ్ మందిర్ ప్రాంతీయ అభివృద్ధిని స్పష్టంగా ధ్రువీకరించింది.

**భారీగా పర్యాటకుల రాక..**

రామ మందిరం నిర్మానానికి ముందు అయోధ్యకు ఏటా 1.7 లక్షల మంది సందర్శకులు వచ్చేవారు. 2024 మొదటి ఆరు నెలల్లోనే 11 కోట్ల మంది అయోధ్యను సందర్శించారు. 2025 కుంభమేళాతో రికార్డు స్థాయిలు. 2025-26కు టూరిజం ఆదాయం రూ.10,000 కోట్లకు చేరనుంది. చుట్టుపక్కల తీర్థక్షేత్రాల సందర్శనలు కూడా పెరిగాయి.

**వ్యాపారాల వృద్ధి..**

చిన్నచిన్న దుకాణాదారులకు ఇదివరకు రోజుకు రూ.500 ఆదాయం రాగా, ఇప్పుడు రూ.2,500 వస్తోంది. ఇక రియల్ ఎస్టేట్ విషయానికి వస్తే.. అమాంతం పెరిగింది. అయోధ్య పట్టణం నుంచి కేంద్రానికి రూ.400 కోట్ల జీఎస్టీ వస్తోంది. టూరిజం పరంగా చూస్తే 2025-26కు సంబంధించిన అంచనా ప్రకారం..రూ.10వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. హోటల్ రూంల విషయానికి వస్తే 2024వరకు 2 వేల హోటళ్లు ఉండగా, ఇప్పుడు 5 వేలకు పెరిగాయి. రెస్టారెంట్లు గతంలో 200 ఉండగా, ఇప్పుడు 2 వేలకు పెరిగాయి. పేదవాడికి సంబంధించిన రిక్షాల సంఖ్య గతంలో 500లు ఉండగా, ఇప్పుడు 17వేలకు పెరిగింది, వస్త్ర దుకాణాలు గతంలో 150 ఉండగా ఇప్పుడు 500లకు పెరిగాయి. హోం స్టేలు, ఇళ్లలో పేయింగ్ గెస్ట్‌గా ఉండే హోం స్టేల సంఖ్య 1136కు పెరిగింది. గతంలో ఒక్కటి కూడా ఉండేది కాదు. 'గుడి వృథా'



వాదనలు తప్పుగా ఉన్నాయి. మందిరం టూరిజం ద్వారా బడులు, ఆసుపత్రుల నిధులు సొంతంగా వస్తున్నాయి. స్థానికుల ఆదాయం 5రెట్లు పెరిగింది. ఇది సాంస్కృతిక విశ్వాసాలు ఆర్థిక ప్రగతికి దారి తీస్తాయని నిరూపిస్తోంది.

ఇండస్ ఇండ్ బ్యాంక్
(IndusInd Bank)
ప్రైవేట్ బ్యాంకింగ్‌లో వినూత్న సేవలు అందిస్తోంది. వాహన రుణాలు, కమర్షియల్ ఫైనాన్స్‌లో బలమైన స్థానం ఉంది.










## దక్షిణాఫ్రికా దూకుడు..

### యూఏఈపై ఆరు వికెట్ల విజయం

టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్-డీ మ్యాచ్‌లో జట్టు ఆరు వికెట్ల తేడాతో పై గెలిచింది. ఈ విజయంతో గ్రూప్ దశలో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ దక్షిణాఫ్రికా విజయ పరంపర కొనసాగించింది. మొదట బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 122 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్‌లో అలీషాన్ షరఫూ 45 పరుగులతో కీలకంగా రాణించాడు. లక్ష్య చేధనలో దక్షిణాఫ్రికా ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. రికెల్టన్ 16 బంతుల్లో 30 పరుగులు, బ్రెవిస్ 25 బంతుల్లో 36 పరుగులు చేసి జట్టును విజయ తీరాలకు చేర్చారు. కేవలం 13.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుని 40 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్ ముగించారు. బౌలింగ్‌లో కార్బిన్ బాష్ మూడు వికెట్లు సాధించి ఆకట్టుకున్నాడు. గ్రూప్-డీ నుంచి ఇప్పటికే తో పాటు దక్షిణాఫ్రికా సూపర్-8 దశకు అర్హత సాధించింది.



## పాక్ తో కయ్యం.: ఇండియాలో ఇక ఐసీసీ టోర్నీలు జరగవా?

భారత్-పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ క్రికెట్ వ్యవహారాలపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో International Cricket Council కీలక నిర్ణయాలపై ఆలోచన చేస్తున్నట్లు క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.2029లో జరగాల్సిన ICC Champions Trophy, 2031లో నిర్వహించాల్సిన ICC Cricket World Cup పోటీల ఆతిథ్య హక్కులపై పునఃసమీక్ష జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ టోర్నీల నిర్వహణను భారత్‌కు బదులుగా ఆస్ట్రేలియాకు అప్పగించే అంశం చర్చలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ఐసీసీ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ అంశం క్రీడా ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.



# లంకకు గట్టి దెబ్బ..

## సూపర్–8 ముందు పతిరణ అవుట్

టీ20 ప్రపంచకప్-2026కు భారత్‌తో కలిసి ఆతిథ్యం ఇస్తున్న శ్రీలంక జట్టు సొంత గడ్డపై అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. గ్రూప్-బిలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన లంక జట్టు సూపర్-8 దశకు అర్హత సాధించింది. గ్రూప్ టాపర్‌గా నిలిచి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. దసున్ షనక సారథ్యంలో శ్రీలంక మొదట ఐర్లాండ్‌ను, తర్వాత ఒమన్‌ను ఓడించింది. కీలక మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచి తదుపరి దశకు టికెట్ ఖరారు చేసుకుంది. లీగ్ దశలో చివరి మ్యాచ్‌ను జింబాబ్వేతో కొలంబోలో ఆడనుంది. అయితే జట్టు శిబిరంలో ఆందోళన నెలకొంది. ప్రధాన పేసర్ మతీశ పతిరణ గాయంతో మిగిలిన టోర్నీకి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆస్ట్రేలియా మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తుండగా తొడ కండరాలకు ఇబ్బంది కలగడంతో మైదానం వీడాడు. పూర్తిగా కోలుకోవడానికి కొన్ని వారాలు పట్టే అవకాశం ఉందని సమాచారం. పతిరణ స్థానంలో బినుర ఫెర్నాండో లేదా దిల్షాన్ మధుషాంకకు అవకాశం లభించవచ్చు. నువాన్ తుషార, మిలాన్ రత్ననాయకే కూడా ఎంపికకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే వనిందు హసరంగా గైర్హాజరీ జట్టుకు దెబ్బ కాగా, ఇప్పుడు పతిరణ గాయం మరో సవాలుగా మారింది.

# పసికూనపై పాక్ ప్రతాపం

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ బ్యాటర్లు చెలరేగారు. సూపర్-8 ఆశలు నిలబెట్టుకోవాలంటే తప్పనిసరి విజయంగా భావించిన ఈ పోరులో పాక్ భారీ స్కోరు నమోదు చేసింది.ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ అజేయ శతకంతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. 58 బంతుల్లోనే శతకం పూర్తి చేసి బౌండరీల వర్షం కురిపించాడు. సల్మాన్ అఘా వేగవంతమైన ఇన్నింగ్స్‌తో తోడ్పడగా, షాదాబ్ ఖాన్ చివర్లో మెరుపులు మెరిపించాడు. నిర్ణీత 20 ఓవర్లలో పాకిస్తాన్ మూడు వికెట్లకు 199 పరుగులు సాధించింది.నమీబియా బౌలర్లు ప్రతిఘటన చూపించినప్పటికీ భారీ స్కోరు ఆపలేకపోయారు. బెర్నార్డ్ స్కోల్జ్, రూబెన్ ట్రంపెల్‌మాన్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. జాక్ బ్రస్సెల్ రెండు వికెట్లు తీశాడు. అదనపు పరుగులు తక్కువగా ఇవ్వడం నమీబియా నియంత్రణను సూచించింది.




## అర్జున్ పెళ్లి వేడుకల్లో గిల్ సందడి.

టీమిండియా యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహానికి ముందు జరిగిన వేడుకల్లో ఉత్సాహంగా నృత్యం చేస్తూ కనిపించాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి. మైదానంలో శాంతంగా కనిపించే గిల్, ఈసారి ఉల్లాసంగా నర్తించడం అభిమానులను ఆకట్టుకుంది.అర్జున్ టెండూల్కర్ తన దీర్ఘకాల స్నేహితురాలు సానియా చండోక్‌ను మార్చి 5, 2026న ముంబైలో వివాహం చేసుకోనున్నాడు. ఈ వేడుకకు దేశ రాజకీయ, క్రీడా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యే అవకాశముందని సమాచారం.ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు క్రీడా ప్రపంచం నుంచి విరాట్ కోహ్లీ, ఎంఎస్ ధోనీ, యువరాజ్ సింగ్ వంటి ప్రముఖులు హాజరయ్యే అవకాశముందని తెలుస్తోంది. గిల్, కోహ్లీ కలిసి వేడుకల్లో సందడి చేస్తారా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.



## రంజీలో జమ్మూకశ్మీర్ తొలి సారి ఫైనల్‌కు

దేశవాళీ క్రికెట్‌లో అగ్రగామి టోర్నీ అయిన రంజీ ట్రోఫీలో జమ్మూ కశ్మీర్ జట్టు కొత్త చరిత్ర రాసింది. సెమీఫైనల్‌లో బెంగాల్పై ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి తొలిసారి ఫైనల్‌కు చేరుకుంది.కళ్యాణిలో జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 328 పరుగులు చేసింది. సుదీప్ కుమార్ 146 పరుగులతో జట్టుకు బలమైన స్కోరు అందించాడు. జమ్మూకశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 302 పరుగులకు ఆలౌటై 26 పరుగుల వెనుకబడింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో బెంగాల్‌ను 99 పరుగులకే పరిమితం చేసి మ్యాచ్‌ను తమవైపు తిప్పుకుంది.126 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జమ్మూకశ్మీర్ నాలుగు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. అబ్దుల్ సమద్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కీలకంగా రాణించగా, అకీబ్ నబీ మొత్తం తొమ్మిది వికెట్లు తీసి మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. వన్షాజ్ శర్మ అజేయంగా 43 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించాడు.హిమాలయ ప్రాంతానికి చెందిన జట్టు రంజీ ఫైనల్‌కు చేరడం ఇదే మొదటిసారి కావడం విశేషం. బెంగాల్ తరఫున మొహమ్మద్ షమీ తొమ్మిది వికెట్లు తీసినా ఫలితం మారలేదు.






## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ నంబర్ వన్.. టాప్–10లోకి ఇషాన్

International Cricket Council విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ అగ్రస్థానాన్ని కొనసాగించాడు. టీ20 ప్రపంచకప్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, బ్యాటర్ల జాబితాలో నంబర్ వన్ ర్యాంక్‌ను కాపాడుకోవడం విశేషం. ఇక వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ భారీగా ర్యాంకులు ఎగబాకి టాప్-10లో చోటు సంపాదించాడు. ఇటీవల వరుసగా రెండో అర్ధశతకం సాధించిన అతడు ఏకంగా 17 స్థానాలు మెరుగుపరుచుకుని ఎనిమిదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. పతుమ్ నిస్సంక మూడో స్థానానికి ఎగబాకాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో సైమ్ అయూబ్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. అతని ప్రదర్శనతో సికందర్ రజా రెండో స్థానానికి జారాడు. బౌలర్ల జాబితాలో రషీద్ ఖాన్ ఒక స్థానం మెరుగుపరుచుకుని రెండో ర్యాంక్‌కు చేరి అగ్రస్థానంలో ఉన్న వరుణ్ చక్రవర్తికు చేరువయ్యాడు. భారత బౌలర్లు అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా కూడా తమ స్థానాలను మెరుగుపరుచుకున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
19.02.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






## రానాతో అట్లీ చర్చలు..
# త్వరలో క్లారిటీ?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రంపై ఎప్పటికప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. షూటింగ్ ముంబైలో నిరవధికంగా కొనసాగుతుండగా, ఇటీవల హీరోయిన్‌గా జాన్వీ కపూర్ కూడా సెట్స్‌లో జాయిన్ అయ్యింది. ఇప్పుడేమో ఈ ప్రాజెక్ట్‌లో రానా దగ్గుబాటి కీలక పాత్రలో కనిపించనున్నాడన్న టాక్ వినిపిస్తోంది. ముంబైలో అల్లు అర్జున్ రానాను వ్యక్తిగతంగా కలసి మాట్లాడినట్టు, తదుపరి రోజు అట్లీ కథను వినిపించినట్టు సమాచారం.రానా ఈ ఆఫర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడా లేదా అన్నది మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. త్వరలోనే ఈ అంశంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.





## డైలాగ్స్‌తో దడపుట్టిస్తున్న ఉస్తాద్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ వీడియోల్లో వినిపించిన మాస్ డైలాగ్స్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచేశాయి. "ఈసారి పెర్ఫార్మన్స్ బద్దలైపోతాది", "గాజు పగిలే కొద్దీ పదునెక్కుద్ది", "గ్లాస్ అంటే సైజు కాదు... సైన్యం" వంటి పంచ్ లైన్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి.ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 22న హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్లో గ్రాండ్ ఈవెంట్ నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. ఈ వేడుకలో '#TheAuraOfUstaad' పాటను విడుదల చేయనున్నారు. ఈ పాటకు ఆస్కార్ విజేత చంద్రబోస్ సాహిత్యం అందించగా, ఫ్యాన్స్ జీవితాంతం గుర్తు పెట్టుకునేలా ఉంటుందని టాక్.దర్శకుడు హరీష్ శంకర్ ట్రైలర్‌ను పవర్‌ఫుల్ డైలాగ్‌స్‌తో కట్ చేశారట. మార్చి 10లోపు థియేట్రికల్ ట్రైలర్ విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం.మార్చి 26న విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం సుమారు 165 నిమిషాల నిడివితో ఉండనుంది. పాటలు, డైలాగ్స్, మాస్ ఎలిమెంట్స్ అన్నీ కలిసివచ్చేలా ఉండటంతో పవర్ స్టార్ అభిమానులు ఇప్పటికే సెలబ్రేషన్ మూడ్‌లోకి వెళ్లిపోయారు.

## ఫంకీ కలిసొచ్చింది ఆమెకే..

వేలంటైన్ దినోత్సవం సందర్భంగా విడుదలైన 'ఫంకీ'పై మంచి అంచనాలు నెలకొన్నాయి. యువతలో ఆదరణ ఉన్న విశ్వక్ సేన్ను హీరోగా తీసుకుని, 'జాతిరత్నాలు'తో పేరు తెచ్చుకున్న అనుదీప్ కేవీ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ.
అయితే విడుదలైన వెంటనే చిత్రానికి ప్రతికూల స్పందన వచ్చింది. సమీక్షలు నిరాశపరిచాయి. తొలి వారాంతానికే ప్రేక్షకాదరణ తగ్గిపోవడంతో సోమవారం నుంచి వసూళ్లు పడిపోయాయి. ఈ ఫలితం దర్శకుడు, హీరో, నిర్మాతలకు ఎదురుదెబ్బగా మారింది.
అయితే నాయిక కాయదు లోహర్కు మాత్రం ఈ చిత్రం మంచి గుర్తింపు తీసుకొచ్చింది. సినిమా ఫలితం నిరాశపరిచినా, ఆమె అందం, ఉత్సాహభరిత నటన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. యువతలో మంచి స్పందన లభించడంతో ఆమెకు కొత్త అవకాశాలు వచ్చే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.





## రాయల్ బ్లూ గౌన్‌లో మెరిసిన జాక్వెలిన్

నలభై ఏళ్ల వయసులో కూడా జాక్వెలిన్ ఫెర్నాండెజ్ గ్లామర్‌తో వార్తల్లో నిలుస్తోంది. జైల్లో ఉన్న సుకేష్ చంద్రశేఖర్తో సంబంధాలపై వివాదాలు వచ్చినప్పటికీ, ఆమె తన స్టైలిష్ అపియరెన్స్‌పై దృష్టి సారిస్తోంది. ఇటీవల రాయల్ బ్లూ బాడీఫిటెడ్ గౌన్‌లో షేర్ చేసిన ఫొటోలు ఆకట్టుకున్నాయి. ఆఫ్‌షోల్డర్ నెక్‌లైన్, ఒక ఫుల్ స్లీవ్ డిజైన్‌తో డ్రెస్ ప్రత్యేకంగా కనిపించింది. స్ట్రెట్ హెయిర్, షార్ప్ మేకప్‌తో ఆమె కాన్ఫిడెంట్ లుక్‌లో మెరిసింది.సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం విడుదలలు తక్కువే. అయితే Welcome to the Jungle చిత్రంపై ఆమె భారీ ఆశలు పెట్టుకుంది.

## టాలీవుడ్ క్రష్‌గా మెరిసే
# అనుపమ

మలయాళ చిత్రాలతో నటిగా తన ప్రతిభను నిరూపించుకున్న అనుపమ పరమేశ్వరన్, 'అ ఆ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ సినిమా విజయంతో టాలీవుడ్‌లో ఆమెకు అవకాశాలు విస్తరించాయి. తర్వాత 'శతమానం భవతి'తో కుటుంబ ప్రేక్షకుల మనసు గెలుచుకుని, 'కార్తికేయ 2' ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించింది. ఇటీవల 'టిల్లు స్క్వేర్'లో ఆధునిక శైలిలో, ధైర్యవంతమైన పాత్రలో కనిపించి మరో కోణాన్ని చూపించింది. కేవలం అందమైన పాత్రలకే పరిమితం కాకుండా, 'లాక్‌డౌన్'లాంటి గంభీర కథల్లోనూ నటిస్తూ తన నటన వైవిధ్యాన్ని చాటుతోంది. చిత్రీకరణల మధ్యలో ఖాళీ సమయాన్ని చిత్రలేఖనంతో గడపడం ఆమెకు ఇష్టం. తన చిత్రాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటోంది. ఫిబ్రవరి 18న ఆమె పుట్టినరోజు సందర్భంగా అభిమానులు సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షల వర్షం కురిపించారు.

## మగాళ్ల మనస్తత్వం మారలేదు : నీనా గుప్తా

ప్రముఖ నటి నీనా గుప్తా భారతీయ సమాజంలో మహిళల పరిస్థితిపై ఘాటుగా స్పందించారు. సమాజం ఎంతో మారిపోయిందనే మాటల్లో వాస్తవం లేదని ఆమె పేర్కొన్నారు. బయటకు విశాల దృష్టికోణం ఉన్నట్లు కనిపించినా, వివాహం విషయంలో చాలామంది పురుషులు ఇప్పటికీ కన్యత్వానికే ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. వివాహం తర్వాత మహిళలపై కుటుంబ నియంత్రణలు కొనసాగుతున్నాయని, వారికి ఇష్టమైన ఆచారాలు, విశ్వాసాలు పాటించేందుకు కూడా అడ్డంకులు ఉన్నాయని తెలిపారు. సమానత్వం గురించి మాట్లాడుతున్నప్పటికీ, పురుషుల మనస్తత్వంలో పెద్ద మార్పు రాలేదని నీనా గుప్తా స్పష్టం చేశారు.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com